



# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 133 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | ఆదివారం 18 జనవరి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :133 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | SUN 18 JANUARY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## నేడు దావోస్‌కు సీఎం చంద్రబాబు...

### నాలుగు రోజుల పాటు ఫుల్ బిజీ!

- ప్రపంచ ఆర్థిక సదస్సులో పారిశ్రామిక దిగ్గజాలతో చర్చలు
- ఐబీఎం, గూగుల్, మేర్క్ సీఈఓలతో కీలక సమావేశాలు
- 4 రోజుల పర్యటనలో 36 కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం
- తొలిరోజు 20 దేశాల ఎన్నార్టీలతో డయాస్పోరా సమావేశం

- మిగతా 2లో...

# చరిత్ర తిరగరాయటం తెలుగువాళ్లతోనే సాధ్యం

- కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన
- 2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్
- 2027 జూన్ నాటికి గ్రీన్ అమోనియా ఉత్పత్తి ప్రారంభం అవుతుందని వెల్లడి
- గ్రీన్ ఎనర్జీలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామని ఉద్ఘాటన








**పెన్ పవర్ డెస్క్:**చరిత్రను తిరగరాయడం తెలుగువాళ్లకే సాధ్యమని, ప్రపంచ గతిని మార్చే శక్తిసామర్థ్యాలు మనవారికి ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ సత్తాను చాటేలా, ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు కాకినాడ వేదిక కావడం తెలుగువారందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఏఎమ్ గ్రీన్ ఆధ్వర్యంలో కాకినాడలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి చంద్రబాబు ఇవాళ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుతో ఇకపై ప్రపంచం మొత్తం కాకినాడ వైపు చూస్తుందని, భవిష్యత్ ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "గతంలో ఇదే ప్రాంతంలో నాగార్జునా ఫెర్టిలైజర్స్ గ్రే అమోనియా తయారు చేస్తే, ఇప్పుడు అదే చోట పర్యావరణహితమైన గ్రీన్ అమోనియా ఉత్పత్తి కాబోతోంది. ఇది మార్పునకు సంకేతం. చరిత్రను తిరగరాయడం అంటే ఇదే. తెలుగువాళ్లు తలచుకుంటే ఏదైనా సాధించగలరు. గత ఏడాది ఈ ప్రాజెక్టుకు అనుమతిస్తే, సరిగ్గా ఏడాది తిరిగేసరికి పనులు ప్రారంభించడం మన పనితీరుకు నిదర్శనం.

వివరాలు 2లో..



## బీహార్‌లో గెలిచాం.. బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది

- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమత ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న నరేంద్ర మోదీ
- కేంద్రం ఇస్తున్న నిధులను మమతా బెనర్జీ కొల్లగొడుతోందని విమర్శ

**పెన్ పవర్ డెస్క్:**బీహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక పశ్చిమ బెంగాల్‌కు సమయం ఆసన్నమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. బెంగాల్ పర్యటనలో భాగంగా మాల్దాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను మమతా బెనర్జీ ప్రభుత్వం కొల్లగొడుతోందని మోదీ ఆరోపించారు. తృణమూల్

- మిగతా 2లో...

## యుద్ధం ముగియలేదు... ఇప్పుడే ప్రారంభమైంది



- ఈ గెలుపు ద్వారా తమను నిర్వీర్యం చేశామని బీజేపీ నేతలు భావిస్తున్నారన్న థాకరే
- బీజేపీ కుట్రలను త్వరలో బయటపెడతామని వ్యాఖ్య
- ముంబైలో శివసేన నుంచి మేయర్‌ను నియమించాలనేది తమ కల అన్న థాకరే

వివరాలు 2లో..

## 11 సీట్లకే పరిమితమైనా మీ 'తాచుపాము' బుద్ధి మారలేదు

- ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ విషం చిమ్ముతోందని మంత్రి పార్థసారథి విమర్శ
- నాడు అసెంబ్లీలో జై కొట్టి, అధికారంలోకి వచ్చాక జగన్ మాట మార్చారని ఆరోపణ
- సొంత ప్యాలెస్‌లకు వేల కోట్లు ఖర్చుపెట్టారని, రాజధానికి మాత్రం అడ్డుపడుతున్నారని ఫైర్
- అమరావతి పనులు వేగవంతం చేశాం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే కూటమి లక్ష్యమని స్పష్టీకరణ




**పెన్ పవర్ డెస్క్:**"2024 ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురై కేవలం 11 సీట్లకే పరిమితమైనా వైసీపీ నేతల 'తాచుపాము' బుద్ధి మారకపోవడం రాష్ట్ర దౌర్భాగ్యం" అని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధిపై, ముఖ్యంగా ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ విషప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేయడమే లక్ష్యంగా వైసీపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. "హెల్దీ-హ్యాపీ-వెల్తీ స్టేట్ అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంటే, రాష్ట్రంలో కనిపిస్తున్న ఆశాజనక వాతావరణాన్ని దెబ్బతీయడమే వైసీపీ పనిగా పెట్టుకుంది. ఒకప్పుడు ఇదే అసెంబ్లీలో అమరావతికి మనస్ఫూర్తిగా

- మిగతా 2లో...



## గోరంట్ల మాధవ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ

- అత్యాచార ఘటనకు సంబంధించి వివరాలను వెల్లడించారనే కేసు
- గతంలోనే పోక్సో చట్టం కింద కేసు నమోదు
- కోర్టు విచారణలకు హాజరుకాని గోరంట్ల మాధవ్

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు న్యాయపరంగా తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. ఆయనపై విజయవాడలోని పోక్సో ప్రత్యేక కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటనకు సంబంధించిన సున్నితమైన వివరాలను బహిరంగంగా వెల్లడించారనే ఆరోపణలతో గోరంట్ల మాధవ్‌పై గతంలోనే పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ ఫిర్యాదును మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఇచ్చారు. ఈ కేసు విచారణకు రావాలంటూ కోర్టు పలుమార్లు నోటీసులు

- మిగతా 2లో...



## బంగ్లాదేశ్‌లో దారుణం.. మరో హిందువు దారుణ హత్య

- పెట్రోల్ పోయించుకుని డబ్బులు ఇవ్వకుండానే వెళ్లే ప్రయత్నం చేసిన నిందితుడు
- కారును ఆపే ప్రయత్నం చేసిన హిందూ ఉద్యోగి రిపోన్ సాహా
- కారుతో ఢీకొట్టి హత్య చేసిన బీఎన్‌పీ మాజీ నాయకుడు

- మిగతా 2లో...




## చైనా స్కూలులో నోరో వైరస్ కలకలం..

### వంద మందికి పైగా సోకిన వైరస్

- గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ లోని స్కూలులో 103 మంది విద్యార్థులకు నోరో వైరస్
- అప్రమత్తమైన అధికారులు.. స్కూలు చుట్టుపక్కల వైద్య పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడి
- స్కూలు మొత్తం వైరస్ ను నాశనం చేసే మందులు స్ప్రే చేసిన అధికారులు

2లో...



### కత్తులతో దాడి చేసుకున్న టీడీపీ, వైసీపీ కార్యకర్తలు..

## టీడీపీ కార్యకర్త మృతి

కాకినాడ జిల్లా అల్లిపూడి గ్రామంలో ఉద్రిక్తత

దాడిలో నలుగురికి తీవ్ర గాయాలు

గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేసిన పోలీసులు

- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

## పశ్చిమబెంగాల్ దిశానిర్దేశకుడు జ్యోతిబసు

మార్క్సిస్టు యోధుడు, సీపీఐ(ఎం) ఆవిర్భావ నాయకులు, ప్రజా, కార్మిక పక్షపాతి జ్యోతిబసు. నాడు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి గా జ్యోతిబసు లెఫ్ట్ ఫ్రంట్ పాలన రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చివేసిన విషయం దేశమంతా తెలిసిందే. కరువు రాష్ట్రంగా కునారిల్లిన పశ్చిమబెంగాల్‌ను అన్నపూర్ణగా మార్చింది. అణగారిన వర్గాలకు ఇరవై ఐదు లక్షల ఎకరాలను పంచి (భూ సంస్కరణలు చేపట్టి) దేశంలోనే కాదు, ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచింది. కష్టజీవులకు, కార్మిక వర్గానికి అండదండలిచ్చింది. అంతర్జాతీయ సౌహార్ధతకు దిక్సూచిగా నిలిచింది. అలాగే ఎల్ఐసి పరిరక్షణకు పూర్తి బాసటగా నిలిచింది. దీనివల్ల,బీమా ఉద్యోగుల పోరాటాలు విజయవంతమయ్యాయి. ”ఇలాకో విజిలు పేరుతో ఆటోమేషన్ (కంప్యూటరీకరణ)కి వ్యతిరేకంగా ఏఐఐఇఏ, జరిపిన పోరాటంలో జ్యోతిబసు లెఫ్ట్‌ఫ్రంట్ శ్రేణులు నిర్వర్తించిన మహత్తరమైన పాత్రను ఎల్ఐసి ఉద్యోగులు ఎవరూ మర్చిపోలేరు. బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన ఉన్న సందర్భంగా ఎలాగైనా సూపర్ కంప్యూటర్‌ను ఇన్‌స్టాల్ చేయాలనే ప్రభుత్వ, యాజమాన్య ప్రయత్నాలు ఫలించలేదు. 1968 దసరా సెలవుల్లో కంప్యూటర్‌ను ఇలాకో భవనంలో పెట్టాలని ప్రయత్నాలు, ఊహాగానాలు మొదలయ్యాయి. దీంతో పెద్దఎత్తున ఇలాకో విజిల్ కొనసాగింపు జరిగింది. ఇలాకో భవనం దగ్గర కాళీమాత విగ్రహం పెట్టి దసరా పండగ నిర్వహించారు. జ్యోతిబసు, ఇతర కమ్యూనిస్టు యోధులు, ఇతర రాజకీయ నాయకులు, జాతిన్ చక్రవర్తి, జ్యోతిర్మయి బసుతో బాటు అనేక మంది ఈ విజిల్‌లో పాల్గొన్నారు. 24 పరగణా జిల్లాలోని గిరిజనులు(వీరికి గతంలో కరువు సందర్భంగా అంబలి ఇచ్చి ఎఐఐఈఎ యూనిట్లు వారిని ఆదుకున్నాయి)తమ విల్లంబులతో వచ్చి ఈ విజిల్‌లో పాల్గొన్నారు. 24 గంటలూ, 365 రోజుల పాటు ఈ ఉద్యమం కొనసాగింది.

ప్రభుత్వ అంచనాలు తలకిందులె యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచింది. అప్పటి హోంమంత్రి జ్యోతిబసు ఇలాకో భవనంలో కంప్యూటర్ పెట్టడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని చెప్పారు. చివరకు ఫోర్ట్ విలియమ్స్‌లో మిలిటరీ రక్షణలో ఉన్న కంప్యూటర్‌ను పశ్చిమబెంగాల్ నుండి వెనక్కు తరలించారు. కంప్యూటరీకరణ వ్యతిరేక ఉద్యమం చరిత్రాత్మక విజయం సాధించింది. ఆటోమేషన్ వ్యతిరేక ఉద్యమంలో భారత కార్మిక వర్గానికి దశను, దిశను నిర్దేశిస్తూ ఏఐఐఇఏ సాగించిన ఈ ఉద్యమంలో జ్యోతిబసు ఆధ్వర్యంలో వామపక్ష పార్టీలు అనేక మంది జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులను, మేధావులు భాగస్వాములయ్యారు. కంప్యూటర్ పరిజ్ఞానం మన దేశంలో ప్రాథమిక దశలో ఉన్న నేపథ్యంలో బీమా ఉద్యోగులు ఈ ఉద్యమాన్ని చేపట్టింది. ఇండియన్ ఆయిల్ కంపెనీలో కంప్యూటరీకరణ విజయవంతంగా చేయగలిగిన ప్రభుత్వం ఎల్ఐసిలో ఓటమి చూడవలసి వచ్చింది. ఒక కంప్యూటర్ వస్తే దాదాపు 24వేల ఉద్యోగాలు ఎలా పోతాయో ఉద్యోగులు అర్థం చేసుకోగలిగారు. వారిని ఈ పోరాటం జాగృతం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ పరిస్థితులు, కార్మికవర్గ రాజకీయాలు ఈ ఉద్యమానికి కొత్త ఊపునిచ్చాయి. నవంబర్, 67 నుండి మార్చి ,69 వరకు (రాష్ట్రపతి పాలన అమలుఉన్న కాలంలో) అక్కడ ప్రజాతంత్ర ఉద్యమం బీమా ఉద్యోగుల పోరాటాలకు రక్షణాకవచంగా ఉంది. 1969 ఎన్నికలలో యునైటెడ్ ఫ్రంట్ ఎన్నిక బీమా ఉద్యోగుల పోరాట విజ యానికి బాసటగా నిలిచింది. ఆనాడే కంప్యూటర్లు ఎల్ఐసిలో ప్రవేశించి ఉంటే వేలాది మంది ఉద్యోగాలుపోవడమే గాక, సంస్థలో తర్వాత తరాల ఉద్యోగులకే ఉద్యోగ అవకాశాలు ఉండేవి కావు. అందుకే ఈ మహత్తర పోరాటంలో లెఫ్ట్ ఫ్రంట్ ప్రాధాన్యతను, జ్యోతిబసు చిరస్మరణీయమైన పాత్రను ఎల్ఐసి ఉద్యోగులు నిరంతరం జ్ఞాపకం ఉంచుకుంటారు.

1978లో కలకత్తాలో జరిగిన ఏఐఐఇఏ సిల్వర్ జూబ్లి సమావేశాలకు జ్యోతిబసు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీమా రంగాన్ని ప్రయివేటుపరం చేయడంతో బాటు, ఎల్ఐసి, జిఐసిలలో యాభైశాతం వాటాలు విక్రయించాలన్న మల్హోత్రా కమిటీ (1994) కమిటీ సిఫార్సు లకు వ్యతిరేకంగా ఆనాడు వామ పక్షాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశాయి. జ్యోతిబసు ఆధ్వర్యంలోని పశ్చిమ బెంగాల్ లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం, మల్హోత్రా కమిటీ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ఆమోదించింది. అలాగే అప్పటి వామపక్ష ప్రభుత్వాలు అధికారంలో ఉన్న కేరళ, త్రిపుర ప్రభుత్వాలు సైతం ఇదే మాదిరిగా తీర్మానాలు ఆమోదించాయి. ప్రభుత్వ బీమారంగ పరిరక్షణ కోసం ఎల్ఐసి ఉద్యోగులు చేసిన ప్రతి పోరాటానికి సంపూర్ణ సహకారం అందించి, జ్యోతిబసు మొత్తం కార్మిక వర్గంతో బాటు, ఎల్ఐసి ఉద్యోగులకు కూడా ప్రీతి పాత్రులయ్యారు. లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వంఅధికారంలో ఉన్నంత కాలం పశ్చిమబెంగాల్‌లో శాంతి, సామరస్యాలు పరిఢవిల్లాయి. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత సందర్భంగా దేశమంతా మత కల్లోలాలు ప్రజ్వరిల్లినా, పశ్చిమ బెంగాల్‌లో ఒక్క అవాంఛనీయ సంఘటన జరగలేదు. మతోన్మాదశక్తుల పీచమనచడంలో జ్యోతిబసు ప్రభుత్వం స్ఫూర్తివంతమైన పాత్ర పోషించింది. నేడు దేశంలో నెలకొన్న మత ఉద్రిక్తత పరిస్థితులు పురోగామి శక్తులను కలవరపెడుతున్నాయి. ఇటువంటి తరుణంలో జ్యోతి బసు లాంటి పాలనాదక్షుల, రాజనీతిజ్ఞుల అవసరాన్ని మొత్తం దేశం గుర్తిస్తోంది ఎల్ఐసి సంస్థపై, ఉద్యోగులపై, కార్మికవర్గంపై నిరంతరం దాడులు జరుగుతున్న ప్రస్తుత నేపథ్యంలో జ్యోతిబసు జీవితం కార్మిక వర్గానికి, ప్రత్యేకించి బీమా ఉద్యోగులకు ప్రేరణ ఇస్తుంది. ఎల్ఐసి సంస్థను,ప్రభుత్వ రంగాన్ని, కార్మిక హక్కులను, దేశ సమ్మిళిత సంస్కృతిని, సెక్యులర్, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి కృషి చేయడమే జ్యోతిబసుకు బీమా ఉద్యోగులిచ్చే నిజమైన నివాళి.

# చరిత్ర తిరగరాయటం తెలుగువాళ్లతోనే సాధ్యం

- మొదటి పేజి తరువాయి

ఇది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు చక్కటి ఉదాహరణ“ అని అన్నారు. 495 ఎకరాల్లో, 2 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారని వెల్లడించారు. 2027 జూన్ నాటికి ఉత్పత్తి ప్రారంభించి, ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియాను ఇక్కడి నుంచి జర్మనీ వంటి దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యాన్ని అందిపుచ్చుకుని, రాష్ట్రంలో 160 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేశామని చంద్రబాబు తెలిపారు. “సౌర, పవన, జల విద్యుత్‌తో పాటు పంప్డ్ స్టోరేజీకి ఏపీ అత్యంత అనుకూలమైన రాష్ట్రం. మనకున్న సుదీర్ఘ తీరప్రాంతం, రాబోయే 20 పోర్టులతో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ఉత్పత్తికి ఏపీ కేంద్రంగా మారుతుంది. భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీపై ఎక్కడ చర్చ వచ్చినా కాకినాడ పేరు వినిపిస్తుంది“ అని ఆయన పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ‘క్లీన్, గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ పాలసీ-2024‘ దేశంలోనే అత్యుత్తమమైనదని, పారిశ్రామికవేత్తలకు పూర్తి స్వేచ్ఛనిస్తూ, ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకుండా అనుమతులు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, “విశాఖలో గూగుల్ సంస్థ 1 గిగావాట్ సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ ఏడాదిలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. స్పేస్ టెక్నాలజీలో కూడా పురోగతి సాధిస్తాం. ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ ఎకానమీ హబ్‌గా తీర్చిదిద్దుతాం“ అని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో పరిశ్రమలపై విద్యుత్ కొనుగోలు భారాన్ని యూనిట్‌కు రూ.1.19 మేర తగ్గించేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే 29 పైసలు తగ్గించామని తెలిపారు. గ్లోబల్ సంస్థలన్నీ ఏపీ నుంచి తమ కార్యకలాపాలు నిర్వహించాలని పిలుపునిచ్చిన ఆయన, రాష్ట్రంలోకి వచ్చే ప్రతి పెట్టుబడికి ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

## బంగ్లాదేశ్‌లో దారుణం.. మరో హిందువు దారుణ హత్య

బంగ్లాదేశ్‌లో మరో హిందువు దారుణ హత్యకు గురయ్యాడు. గత మూడు వారాల్లోనే బంగ్లాదేశ్‌లో పది మందికి పైగా హిందువులు హత్యకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది.

తాజాగా, పెట్రోల్ పంపులో ఇంధనం నింపుకుని డబ్బులు చెల్లించకుండానే వెళ్లిపోతున్న వ్యక్తిని అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు హిందూ వ్యక్తిని వాహనంతో ఢీకొట్టి హతమార్చారు. ఈ విషాద సంఘటన రాజ్‌బరి జిల్లాలో చోటుచేసుకుంది. మృతుడిని 30 ఏళ్ల రిపోన్ సాహాగా గుర్తించారు. అతడు అక్కడి పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడని పోలీసులు వెల్లడించినట్లు అక్కడి మీడియా వర్గాలు తెలిపాయి. రాజ్‌బరిలోని కరీం ఫిల్లింగ్ స్టేషన్‌లో రిపోన్ సాహా ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) రాజ్‌బరి జిల్లా యూనిట్ మాజీ కోశాధికారి అబుల్ హాషేమ్ పెట్రోల్ నింపుకున్న తర్వాత డబ్బులు చెల్లించకుండానే వెళ్లడానికి ప్రయత్నించాడు. దీంతో రిపోన్ అతడిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, హాషేమ్ తన కారును అతనిపైకి పోనిచ్చాడు. తీవ్ర గాయాలపాలైన రిపోన్ అక్కడికక్కడే మృతి

చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హాషేమ్, అతడి కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## చైనా స్కూలులో నోరో వైరస్ కలకలం.. వంద మందికి పైగా సోకిన వైరస్

చైనాలోని ఓ స్కూలులో వైరస్ కలకలం రేగింది. వంద మందికి పైగా విద్యార్థులు అనారోగ్యానికి గురికావడంతో వైద్యాధికారులు రంగంలోకి దిగి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 103 మంది విద్యార్థులకు ‘నోరా వైరస్’ సోకినట్లు తేలింది. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం.. క్లాస్ రూమ్ లతో పాటు స్కూలు ఆవరణలో వైరస్ ను నాశనం చేసే మందును చల్లారు. వైరస్ బాధిత విద్యార్థులకు చికిత్స అందజేస్తూనే మిగతా విద్యార్థులకు వైరస్ సోకకుండా చర్యలు చేపట్టారు. బాధిత విద్యార్థులు అందరూ కోలుకుంటున్నారని వివరించారు. రోజూ విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షిస్తూ ప్రత్యేక హాజరు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్కూలు పరిసరాల్లోని నివాస సముదాయాల్లో ఉంటున్న వారికి వైరస్ పరీక్షలు చేపట్టినట్లు వివరించారు. గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ డిసీజ్ కంట్రోల్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..

ఏటా అక్టోబర్ నుంచి మార్చి మధ్య ప్రావిన్స్ లో నోరో వైరస్ విజృంభిస్తుందని అధికారులు తెలిపారు. వైరస్ బాధితులు ప్రధానంగా వాంతులు, విరేచనాలతో బాధపడుతుంటారని చెప్పారు. ఈ వైరస్ సాధారణమైందేనని, వైరస్ వ్యాప్తి చాలా వేగంగా ఉంటుందని వివరించారు. ఈ వైరస్ ను తొలిసారి 1968 లో అమెరికాలోని ఓహియో రాష్ట్రం నార్ వాక్ లోని ఓ స్కూలులో గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈ వైరస్ ను నోరో వైరస్ గా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు.

అమెరికాలో ఎక్కువగా ఆహారం ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుందని చెప్పారు. ఏటా ప్రపంచవ్యాప్తంగా 68.5 కోట్ల మంది ఈ వైరస్ బారిన పడుతుండగా.. అందులో 20 కోట్ల మంది ఐదేళ్లలోపు చిన్నారులేనని గణాంకాలు చెబుతున్నాయి. ఈ వైరస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 50 వేల మంది చిన్నారులు సహా 20 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని సమాచారం.

## బీహార్‌లో గెలిచాం.. బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ పార్టీకి హింస, బుజ్జగింపు రాజకీయాలు కావాలని ఆయన విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రానికి అసలైన సవాల్ చొరబాటుదారులేనని మోదీ పేర్కొన్నారు. చొరబాట్లను అరికట్టడంలో తృణమూల్ ప్రభుత్వం విఫలమైందని ఆయన దుయ్యబట్టారు. మాల్దా, ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగడానికి చొరబాట్లే కారణమని ఆయన ఆరోపించారు. బెంగాల్ రాష్ట్రానికి

వరద సహాయ నిధులను కేంద్రం 40 సార్లు అందించినా, ఆ నిధులు అసలైన లబ్ధిదారులకు చేరలేదని ప్రధానమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే బీజేపీ ప్రభుత్వం ఇక్కడ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నారని ఆయన అన్నారు.

# యుద్ధం ముగియలేదు... ఇప్పుడే ప్రారంభమైంది

మహారాష్ట్రలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంతో తమను నిర్వీర్యం చేశామని భావిస్తున్న బీజేపీ నేతలకు అది ఎప్పటికీ సాధ్యం కాదని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే స్పష్టం చేశారు. యుద్ధం ఇప్పుడే మొదలైందని, ఇది ముగింపు కాదని ఆయన ఉద్ఘాటించారు. బీజేపీ కుట్రలను త్వరలోనే బయటపెడతామని అన్నారు. ముంబైలో శివసేన (యూబీటీ) నుంచి మేయర్‌ను నియమించాలనేది తన కల అని, అదే నెరవేరాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని ఆకాంక్షించారు. స్థానిక ఎన్నికల్లో అవకతవకలు జరగడం వల్లే బీజేపీ గెలుపొందిందని ఉద్ధవ్ థాకరే ఆరోపించారు. కుట్రపూరితంగా, అక్రమంగా విజయం సాధించిందని దుయ్యబట్టారు. ముంబైని పూర్తిగా తాకట్టు పెట్టాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల్లో తమ పార్టీ 64 స్థానాలను కైవసం చేసుకుందని గుర్తు చేశారు. 227 స్థానాలున్న బీఎంసీలో బీజేపీ 89 స్థానాలు, శివసేన (షిండే) 27 స్థానాలు, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) 64 స్థానాల్లో విజయం సాధించాయి.

## గోరంట్ల మాధవ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ

- మొదటి పేజి తరువాయి

జారీ చేసినప్పటికీ గోరంట్ల మాధవ్ హాజరు కాకపోవడంతో, చివరకు కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అయితే, తనపై జారీ అయిన నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను రీకాల్ చేయాలని కోరుతూ గోరంట్ల మాధవ్ సోమవారం కోర్టును ఆశ్రయించనున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ కేసు తదుపరి విచారణలో ఏం జరుగుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## కత్తులతో దాడి చేసుకున్న టీడీపీ, వైసీపీ కార్యకర్తలు.. టీడీపీ కార్యకర్త మృతి

కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలోని టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకోవడంతో, ఇరు వర్గాలు కత్తులతో దాడి చేసుకున్నాయి. ఈ దాడిలో టీడీపీ కార్యకర్త బంగారయ్య మృతి చెందాడు. మరో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు దుర్గా ప్రసాద్, శ్రీరామమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వీరిద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైసీపీ కార్యకర్తలు నారాయణమూర్తి, సతీశ్ లకు కూడా తీవ్ర గాయాలు కావడంతో... వీరిని కూడా ఆసుపత్రికి తరలించారు. ఘర్షణ వివరాల్లోకి వెళితే... టీడీపీ కార్యకర్తలు ఒక పుట్టినరోజు వేడుకకు వెళ్లి వస్తుండగా వారికి వైసీపీ కార్యకర్తలు ఎదురుపడ్డారు. ఈ క్రమంలో ఘర్షణ చోటుచేసుకుంది. పాత గొడవలే దీనికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

## 11 సీట్లకే పరిమితమైనా మీ ‘తాచుపాము‘ బుద్ధి మారలేదు

- మొదటి పేజి తరువాయి

‘జై‘ కొట్టిన జగన్మోహన్ రెడ్డి, అధికారం రాగానే ‘నై‘ అని మాట మార్చి రాష్ట్ర ప్రజలను దారుణంగా వంచించారు. ఐదేళ్ల పాటు రాజధాని లేకుండా చేసి ప్రజల కలలను విధ్వంసం చేశారు“ అని పార్థసారథి మండిపడ్డారు.

2019కి ముందు అమరావతే రాజధాని అని, తాను తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నానని నమ్మబలికిన జగన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక తుగ్లక్ పాలనను తలపించేలా మూడు రాజధానుల నాటకం ఆడారని విమర్శించారు. రాజధాని కోసం 33 వేల ఎకరాలు త్యాగం చేసిన 29 వేల మంది రైతులను అవమానించారని, అమరావతిని ఎడారి, శ్మశానంతో పోల్చారని గుర్తుచేశారు. “సొంత అవసరాల కోసం వందల ఎకరాల్లో, వేల చదరపు అడుగుల ప్యాలెస్‌లు కట్టుకున్న నాయకులు, ఐదు కోట్ల ప్రజలకు రాజధాని అవసరమా అని ప్రశ్నించడం సిగ్గుచేటు. కులాల మధ్య చిచ్చు, ప్రాంతాల మధ్య విషం చిమ్ముతూ నీచ రాజకీయాలు చేయడం జగన్ రెడ్డికి అలవాటుగా మారింది“ అని దుయ్యబట్టారు. అమరావతిపై ఇన్సైడర్ ట్రేడింగ్ అంటూ అసత్య ఆరోపణలు చేసి హైకోర్టు, సుప్రీంకోర్టుల చేత మొట్టికాయలు తిన్నా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదని పార్థసారథి అన్నారు. “పీపీపీ విధానంలో రాష్ట్రానికి వచ్చే సంస్థలను ‘మేం వస్తే అరెస్ట్ చేస్తాం‘ అని బెదిరించడం అత్యంత జుగుప్సాకరం. ఇది రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసే కుట్ర కాదా?“ అని ప్రశ్నించారు. చంద్రబాబు సైబరాబాద్‌ను నిర్మించినప్పుడు కూడా ఇలాంటి విమర్శలే వచ్చాయని, కానీ నేడు ఆ ప్రాంతం విలువ అందరికీ తెలుసని అన్నారు. అమరావతి పూర్తయితే వచ్చే లక్షల కోట్ల సంపదతోనే రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతిలో పనులు శరవేగంగా సాగుతున్నాయని, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులతో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. విశాఖ, అనకాపల్లి ప్రాంతాల్లోనూ టీసీఎస్, రిలయన్స్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. “రాజ్యాంగంపై గౌరవం లేని వైసీపీ, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం లేక బయట కూర్చుని విషప్రచారం చేస్తోంది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఈ నిజాన్ని ప్రజలు గ్రహించి, విధ్వంసకర శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి“ అని మంత్రి పార్థసారథి పిలుపునిచ్చారు.

# నేడు దావోస్‌కు సీఎం చంద్రబాబు...

ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు (జనవరి 18) స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ప్రపంచ ఆర్థిక సదస్సు (వరల్డ్ ఎకనామిక్ ఫోరం)లో పాల్గొనేందుకు ఆయన మంత్రులు, ఉన్నతాధికారుల బృందంతో కలిసి ఆదివారం బయల్దేరి వెళ్లనున్నారు. జనవరి 19 నుంచి 22 వరకు నాలుగు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ఆయన అత్యంత బిజీగా గడపనున్నారు. మొత్తం 36 కార్యక్రమాల్లో పాల్గొంటూ, ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక దిగ్గజాలతో ముఖాముఖి సమావేశాలు జరపనున్నారు.

ఆదివారం రాత్రి 8:35 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి, అక్కడి నుంచి జ్యూరిచ్‌కు ముఖ్యమంత్రి పయనం కానున్నారు. జనవరి 19న ఉదయం జ్యూరిచ్ చేరుకున్నాక, స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్ ఆయనతో మర్యాదపూర్వకంగా సమావేశమవుతారు. అనంతరం ఎరోస్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కిశోర్ లుల్లా, ఆయన బృందంతో భేటీ అవుతారు. పర్యటనలో తొలి ముఖ్య కార్యక్రమంగా, జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో భారత ఎంబసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘తెలుగు డయాస్పోరా’ సదస్సులో చంద్రబాబు పాల్గొంటారు. సుమారు 20 దేశాల నుంచి హాజరయ్యే ప్రవాస తెలుగువారిని (ఎన్నార్టీలు) ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో దావోస్ చేరుకుంటారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆర్థిక, పర్యాటక శాఖల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో జరిగే అంతర్జాతీయ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ముఖ్యమంత్రితో సమావేశమవుతారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ కూడా సీఎంతో భేటీ కానున్నారు. ప్రముఖ విదేశీ మీడియా సంస్థ ‘పొలిటికో’కు చంద్రబాబు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు.

### టెక్ దిగ్గజాలతో కీలక చర్చలు

పర్యటనలో రెండో రోజు అత్యంత కీలకంగా జరగనుంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహించే ‘ఇండియా ఎట్ సెంటర్: జియోగ్రఫీ, గ్రోత్ – ఏపీ అడ్వాంటేజ్‘ అనే బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో ముఖ్యమంత్రి పాల్గొని రాష్ట్రంలోని అవకాశాలను వివరిస్తారు. అనంతరం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ‘ఇండియా లాంజ్‘ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత టెక్నాలజీ రంగంలో ప్రపంచ దిగ్గజ సంస్థలైన ఐబీఎం ఛైర్మన్, సీఈఓ అరవింద్ కృష్ణ, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌లతో చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ భేటీ అవుతారు. ఈ సమావేశాల్లో రాష్ట్రానికి టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. అదే రోజు ఇజ్రాయెల్ ఆర్థిక, పారిశ్రామిక మంత్రి నిర్ బర్కత్‌తో, స్విట్జర్లాండ్ ఆర్థిక వ్యవహారాల డిప్యూటీ మంత్రి హెలెన్ బడ్లిజెర్ అర్టెడాతోనూ చర్చలు జరుపుతారు. ఎన్విడియా ఉపాధ్యక్షుడు కాలిస్టా రెడ్‌మండ్‌తో పాటు, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్‌తోనూ సమావేశమవుతారు. రాష్ట్రంలో పోర్టులు, లాజిస్టిక్స్ రంగాల అభివృద్ధికి అత్యంత కీలకమైన అంతర్జాతీయ కంటైనర్ లాజిస్టిక్స్ సంస్థ ఏపీ మోలర్-మేర్స్క్ సీఈఓ విన్సెంట్ క్లెర్క్‌తో ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ ముఖాముఖి సమావేశం కానున్నారు.

### వివిధ అంశాలపై చర్చా వేదికల్లో ప్రసంగాలు

మూడో రోజు పర్యటనలో భాగంగా, ‘హీలింగ్ ప్లానెట్ త్రో రీజెనరేటివ్ ఫుడ్ సిస్టమ్స్‘ అనే అంశంపై జరిగే చర్చా కార్యక్రమంలో, బ్లూమ్‌బెర్గ్ సంస్థ నిర్వహించే ‘ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్: ఏఐ మూమెంట్ ట్రాన్స్‌ఫార్మింగ్ గ్లోబల్ ఎకానమీ‘ సెషన్‌లో ముఖ్య వక్తగా ప్రసంగిస్తారు. పారిశ్రామిక పురోగతి, వాతావరణ మార్పులపై ఫైనాన్సింగ్ వంటి అంశాలపై జరిగే పలు సెషన్లలో కూడా ఆయన పాల్గొంటారు. ఏపీ లాంజ్‌లో కేంద్ర మంత్రులతో కలిసి ‘బిల్డింగ్ ఇండియా ఇన్ఫ్రాస్ట్రక్చర్‘ కార్యక్రమంలో పాలుపంచుకుంటారు.

మొత్తంగా ఈ నాలుగు రోజుల పర్యటనలో 3 ప్రభుత్వాల మధ్య సమావేశాలు, 16 మంది పారిశ్రామికవేత్తలతో వన్-టు-వన్ భేటీలు, 9 రౌండ్ టేబుల్ సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సీఎన్‌బీసీ ఇంటర్నేషనల్ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో ఒక కీలక పెట్టుబడుల గమ్యస్థానంగా నిలపడమే లక్ష్యంగా ఆయన పర్యటన సాగనుంది. ఇక జనవరి 22న దావోస్ నుంచి బయల్దేరి, 23వ తేదీ ఉదయం 8:25 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్ చేరుకుంటారు.

## సామాన్యుడికి మాంసాహారం

# మహాభారం

### -మండిపోతున్న మాంసం ధరలు
### -కొండెక్కిన కోడి గుడ్ల ధరలు







**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం జనవరి 17:**

జిల్లా ప్రజలను తీవ్రంగా కలవరపెడుతున్నది మాత్రం మాంసాహార ధరల మంట, చికెన్, మటన్, నాటు- కోడి, గుడ్డు ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో సామాన్య కుటుంబాల బడ్జెట్ పూర్తిగా తారుమారైంది. మాంసం కొనాలంటే జేబుకు చుక్కలు కనిపించే పరిస్థితి నెలకొంది. సాధారణ రోజుల్లో రూ.180 నుంచి రూ.220 మధ్య ఉండే బ్రాయిలర్ చికెన్ ధర, పండుగ సీజన్లో రూ.300 దాటింది. నాటు కోడి రూ.700 నుంచి రూ.800 వరకు పలుకుతోంది. ఇక మటన్ ధర రూ.1000 ఉండటం గమనార్హం. గుడ్ల ధర కూడా డజను రూ.90కి చేరడంతో మాంసాహార కుటుంబాలకు అదనపు భారంగా మారింది. ఈ ధరలు చూసి చాలా మంది వినియోగదారులు మాంసం ధరలకు బెంబేలెత్తిపోతున్నారు. సంక్రాంతి పండుగ ప్రాధాన్యతే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా మారింది. బోగి, కనుమనాడు ముక్క లేనిదే ముద్ద దిగదు అన్న మాట ఇక్కడి జనజీవనంలో బలంగా నాటుకపోయింది. పశువుల పండుగ అయిన కనుమ తర్వాత కుటుంబమంతా కలిసి మాంసాహార విందు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలనే భావనతో ప్రతి కుటుంబం మాంసం కొనుగోలుకు ముందుకు రావడంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. డిమాండ్ పెరిగితే ధరలు పెరగడం సహజం అనే వాదనను వ్యాపారులు ముందుకు తెస్తున్నారు. ఇంకో ముఖ్యమైన అంశం అల్లుళ్లు, చుట్టాల రాక, ఉద్యోగాలు, చదు వుల రీత్యా పట్టణాలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారు సంక్రాంతికి స్వగ్రామాలకు చేరుకుంటారు. ముఖ్యంగా కొత్త అల్లుళ్లకు, బంధువులకు విందుభోజనాలు ఏర్పాటు చేయడం సంప్రదాయం. మర్యాదలో రాజీ వద్దు అనే భావనతో ధర ఎంత ఉన్నా సరే మాంసం కొనడానికి చాలా కుటుంబాలు సిద్ధపడుతున్నాయి. ఈ మానసికతను వ్యాపారులు అనుకూలంగా మార్చుకుంటు న్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పౌల్ట్రీ రైతులు తమ పరిస్థితిని మరో కోణంలో వివ రిస్తున్నారు. కొన్ని వారాలుగా చలి ఎక్కువగా ఉండటం వల్ల కోళ్ల పెరుగుదల మందగించిందని, కొన్ని ఫామ్లలో వైరస్ భయంతో ముందుగానే కోళ్లను అమ్మేశారని చెబుతున్నారు. దీంతో మార్కెట్కు వచ్చేకోళ్ల సరఫరా తగ్గి డిమాండ్ పెరిగిపోవడంతో ధరలు పెరగడం తప్పలేదనివారు అంటున్నారు. బ్రాయిలర్ చికెన్ కంటే నాటు కోడికి ఉన్న క్రేజ్ కూడా ధరల పెరుగుదలకు కారణమైంది. ధరల నియంత్రణ వ్యవస్థ ఏదీ? ధరల నియంత్రణలో అధికారుల నిఘా కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని మాంసం దుకాణాల్లో బోర్డుపై ఒక రేటు ఉండగా, వాస్తవంగా వసూలు చేసేది ఎక్కువగా ఉంటుందని వినియోగదారులు చెబుతున్నారు. ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు పండుగ సీజన్లో ప్రత్యేక తనిఖీలు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పండుగకు చుట్టాలు వచ్చారు.. పిల్లలు చికెన్ అడుగుతున్నారు. కిలో రూ.340 అంటే ఎలా కొనాలి? గుడ్ల రేట్లు భారీగా పెరిగాయి.. దీంతో పండుగ ఖర్చు పెరిగిపోయిందని ఓ ఉద్యోగి వాపోయారు. ధరలు ఖాతరు చేయని యువత ఇక కొందరు యువకులు మాత్రం భిన్నంగా స్పందిస్తున్నారు. ధరలు ఎక్కువగా ఉన్నాయన్నా, పండుగ కాబట్టి కుటుంబంతో కలిసి భోజనం చేయడం ముఖ్యం. ఏడాదికి ఒక్కసారే కదా అంటూ ఖర్చును సమర్థించుకుంటున్నారు. ఇదే ధోరణి కొనసాగితే భవిష్యత్తులో పండుగలంటేనే ఖర్చుల భయం పెరుగుతుందన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. మొత్తానికి బోగి, సంక్రాంతి, కనుమ పండుగలు సంప్రదాయాల పండుగలు. ఆ సంప్రదాయాలకు మాంసాహారం విడదీయరాని భాగంగా మారింది. కానీ ధరలు పెరుగుతుంటే సామాన్యుడికి పండుగ ఆనందం భారంగా మారుతోంది. ఈ ఏడాది సంక్రాంతి సంతోషం కంటే ముందు ఖర్చు గురించే సామాన్య ప్రజలు మదనపడుతున్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

### కొమరోలులోని ఇస్లాంపేటలో నెలకొన్న

# తీవ్ర నీటి ఎద్దడి

**మరమ్మత్తుల గురైన విద్యుత్ మోటారు.**
**వారం రోజులుగా నిలిచిపోయిన నీటి సరఫరా.**
**తీవ్ర ఇబ్బందులు పడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న పలు వీధుల ప్రజలు.**





**కొమరోలు పెన్ పవర్ జనవరి 17**

కొమరోలు లోని ఇస్లాంపేట తో పాటు పలు వీధులలో గత వారం రోజులుగా నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొమరోలు లోని ఇస్లాంపేట తో పాటు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఇరువైపుల గల వీధులకు నీరు సరఫరా చేసేందుకు గుట్ట కింద ఐదు రోడ్ల కూడలిలో విద్యుత్ మోటారు ఏర్పాటు చేశారు. అయితే సదరు విద్యుత్ మోటారు ఈనెల 12వ తేదీన మరమ్మత్తులకు గురి అయింది. దీనితో వీధులకు నీటి సరఫరా నిలిచిపోయింది. అయితే ఈనెల 13వ తేదీ నుంచి వరుస సెలవులు రావడంతో గ్రామ సచివాలయ సిబ్బంది గత మూడు రోజుల వరకు మరమ్మతుల గురైన విద్యుత్ మోటార్ గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. పలువురు అందించిన సూచన మేరకు గత 3 రోజుల క్రితం మరమత్తుల గురైన విద్యుత్ మోటార్ ను వెలికి తీసి రిపేరుకు తరలించారు. శనివారం సాయంత్రం వరకు కూడా విద్యుత్ మోటార్ ను తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు గత వారం రోజులుగా నీటి ఎద్దడికి గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇస్లాంపేటలో ఏర్పాటుచేసిన కొత్త విద్యుత్ మోటూరు అప్పట్లో మరమ్మతులు గురికావడంతో దానిని తరలించుకు వెళ్లి ఆ మోటారు స్థానంలో పురాతన విద్యుత్ మోటార్ ను అమర్చారని ,ఆ కారణంగా తరచుగా విద్యుత్ మోటారు మరమ్మతులు గురి అవుతూ తమను అష్ట కష్టాల గురి చేస్తున్నదని ఇస్లాంపేట ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక గతంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెండు అదనపు విద్యుత్ మోటార్లు సిద్ధంగా ఉండేవని, పంచాయతీలోని విద్యుత్ మోటార్లలో మరమ్మతులు గురైన మోటారు ను వెలికి తీసి యుద్ధ ప్రాతిపదికంగా మరో మోటారు ఏర్పాటు చేసి ప్రజలకు నీటి సరఫరా కల్పించేవారు. అయితే ప్రస్తుతం గ్రామపంచాయతీ కార్యాలయంలో అదనపు విద్యుత్ మోటార్లు లేవని, గ్రామ సచివాలయ కార్యదర్శి జనార్దన్ రెడ్డి తెలిపారు. ఈ కారణంగా మరమ్మతులకు గురైన విద్యుత్ మోటారు నే రిపేర్ చేయించి ఏర్పాటు చేయవలసిన పరిస్థితి ఏర్పడడంతో కొంత జాప్యం జరుగుతున్నదని ఆయన చెప్పారు. కావున మరమ్మతులు గురి అయిన విద్యుత్ మోటారును స్థానంలో వెంటనే మరో మోటారు ఏర్పాటు చేయటంతోపాటు బోరు నుండి ఇటీవల తొలగించిన అదనపు పైపులను మళ్ళీ ఏర్పాటు చేసి నీటి సరఫరా సౌకర్యం కల్పించాలని పలు వీధుల ప్రజలు కోరుతున్నారు.

# రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం

### -మంత్రి గొట్టిపాటి రవికుమార్







**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం జనవరి 17**

రైతాంగానికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. శనివారం దర్శి నియోజకవర్గంలోని దర్శి, ఉల్లగల్లు , పసుపుగల్లులో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి స్వామితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, బి.ఎన్.విజయ్ కుమార్, దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి, ప్రముఖ వైద్యురాలు గొట్టిపాటి లక్ష్మీ, యర్రగొండపాలెం ఇంచార్జి గూడూరి ఎరిక్షణ్ బాబు కూడా వీటిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ దర్శి పట్టణంలో రూ. 4.2 కోట్లతో డివిజన్ విద్యుత్ కార్యాలయానికి శంకుస్థాపన చేశామని, దీనిని 6 నెలల్లో పూర్తి చేసి ప్రజలకి అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా ఉల్లగల్లు లో 4.19 కోట్లు తో 33/11 కెవి సబ్ స్టేషన్ కి కూడా శంకుస్థాపన చేశామని, ఇది కూడా 6 నెలల్లో పూర్తి చెయ్యాలని అధికారులకి ఆదేశాలు ఇచ్చామన్నారు. ఉల్లగల్లులో స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని అందరితో కలిసి ప్రారంభించడం ఎంతో ఆనందగా ఉందన్నారు. తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని కాపాడిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని మంత్రి కొనియాడారు.ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకి ఉపయోగపడే ఎన్నో విప్లవాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని, అందులో 2 రూపాయలకే కిలో బియ్యం, గురుకుల పాఠశాలలు, మహిళలకి ఆస్థిలో సగం హక్కు కల్పించడం, పక్కా ఇల్లు వాటివి ఉన్నాయన్నారు. అదే మార్గంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కూడా రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం కష్ట పడుతున్నారని ఆయన చెప్పారు.కృష్ణా - గోదావరి అనుసంధానం చేసి గోదావరి నీళ్లను కృష్ణ కి తీసుకువచ్చిన ఒక గొప్ప ముఖ్యమంత్రి దొరకడం మన అదృష్టమన్నారు. గత కూటమి ప్రభుత్వంలో పోలవరం 71 శాతం పూర్తి చేసామని, మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక 84 శాతం పూర్తి చేశామన్నారు. రాబోయే రోజుల్లో రాజధానిని కూడా పూర్తి చేస్తామన్నారు. ప్రజలు కోరుకున్నట్లుగానే దర్శిని అద్దంకి రెవిన్యూ డివిజన్ లో కలపడం జరిగిందన్నారు. అదేవిధంగా దర్శి నియోజకవర్గాన్ని కూడా ప్రకాశం జిల్లాలో ఉంచామన్నారు. ముఖ్యమంత్రి , ఐటీ శాఖ మంత్రి లోకేష్ రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకున్నారని , నిరుద్యోగ యువతకి ఉద్యోగాలు వస్తాయన్నారు మంత్రి వీరాంజనేయస్వామి మాట్లాడుతూ దొనకొండలో బీడీఎల్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేలా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని, దొనకొండని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. 2014-2019 కాలంలో దర్శికి డ్రైవింగ్ స్కూల్ మంజూరు చేస్తే గత ప్రభుత్వం దాన్ని నిలిపివేసిందని, మళ్లీ ఇప్పుడు దాన్ని కూడా పునఃప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని, దాని పనులు త్వరలో ప్రారంభం అవుతాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.200 కోట్లతో సంక్షేమ హాస్టళ్ళు, గురుకులాల ఆధునీకరణకు నిధులు ఇచ్చిందన్నారు. రూ.100 కోట్లతో కొత్త భవనాలను నిర్మించామన్నారు. బీసీ, ఎస్.టి , మైనారిటీ హాస్టల్స్ కి మరో 200 కోట్లు రూపాయలు నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు మంత్రి చెప్పారు. విద్యార్థులకి ఫీజు రీయింబర్స్ రెగ్యులర్ గా చెల్లిస్తున్నామన్నారు. ప్రైవేట్ కాలేజీ లకు కూడా ఫీజు రీయింబర్స్ ఇవ్వడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మంత్రి స్పష్టం చేశారు. అదేవిధంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. ఎన్టీఆర్ ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని, అందులో మండల వ్యవస్థ గొప్పదన్నారు. రైతులకి మేలు చేసేలా కరణం, మునుసూబు వ్యవస్థల్ని రద్దు చేశారన్నారు. ఎన్నికల హామీలో బాగంగా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ ను పోటీ స్థాయిలో అమలు చేస్తున్నామన్నారు. అన్న క్యాంటీన్లు ద్వారా 5 రూపాయలకే పేదలకి అన్నం పెట్టడం గొప్ప విషయం అని ఆయన వ్యాఖ్యానించారు. ఎంపీ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ దర్శి లో విద్యుత్ డివిజన్ కార్యాలయానికి భూమి పూజ చెయ్యటం శుభ పరిణామమని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అబివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాగా భావించి పని చేస్తుందన్నారు. దర్శి అబివృద్ధి లో తన వంతు సహాయం చేస్తున్నాను అని ఎంపీ చెప్పారు. ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడుతూ గడిచిన 18 నెలల్లో కూటమి ప్రభుత్వం అనేక అబివృద్ధి, సంక్షేమం పథకాలను అమలు చేసిందన్నారు. దర్శి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో ఎటువంటి తగాదాలు, గొడవలు, భూ కబ్జాలు లేకుండా ప్రశాంతంగా పరిపాలన సాగుతున్నట్టు చెప్పారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధికి అందరూ తమవంతు బాధ్యత నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మట్లాడుతూ దర్శిలో కూటమి ప్రభుత్వ హయాంలో సబ్ స్టేషన్లు , రోడ్లు, కాలువలు, మంచి నీటి ట్యాంకులు వచ్చాయన్నారు. అభివృద్ధిని వికేంద్రీకరించి అధికార యంత్రాంగాన్ని ప్రజలకు చేరువచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్టం అబివృద్ధి, సంక్షేమంతో ముందుకు వెళ్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాకూడా చెప్పినవి చెప్పినట్టు చేస్తున్నామన్నారు. అన్ని నియోజకవర్గాలలో జరుగుతున్న అభివృద్ధి పనులే దీనికి నిదర్శనం అన్నారు. గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించి పూర్తి చేస్తున్నామన్నారు. వాటితో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా నూతనంగా ప్రారంభించిన అభివృద్ధి పనులను ఆమె ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాపారావు, ఏపీ సిపిడిసిఎల్ ఎస్.ఈ. కట్టా వెంకటేశ్వర్లు, ఈ.ఈ పాలగిరి శ్రీనివాసులు, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బలిజ సంఘము ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ కృష్ణదేవరాయాలు జయంతి



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 17**

గిద్దలూరు బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు చారిత్రక యుగ పురుషుడు మన శ్రీకృష్ణదేవరాయలు అని వక్తలు పేర్కొన్నారు., కృష్ణ దేవరాయలు జనవరి 17, 1471.న జన్మించారని ,అక్టోబర్ 17, 1509 ఫిబ్రవరి 4 న సింహాసనం అధిరోహించి సుపరిపాలన సాగించారన్నారు వీఐకాలంలోనే అష్టదిగ్గజాల కవులను పొందించారని. వీరు కూడా పేరెన్నిక గన్న కవి, పండితుడన్నారు,కవిగా పాలకుడిగా, రైతు రాజ్యం కోసం శ్రమించాడని, నీతిగా, న్యాయంగా, ధర్మపరిపాలకుడిగా, ఖ్యాతి గాంచిన రాజు శ్రీకృష్ణదేవరాయలన్నారు. కులాలకు, మతాలకు అతీతంగా ,అన్ని రకాల మతాల ప్రార్ధనాలయాలను, చెరువులను,, ఎన్నో మరెన్నో తొవ్వించి ఈనాటికి అందరి ఆదరాభిమానాలను పొందే ఆనాటి రాజుగా వెలిగిందిన మహనీయుడని. అన్ని కులాల వారు ఇప్పటికీ స్మరించుకుంటున్నారని పేర్కొన్నారు. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి దక్షిణ భారతదేశంలో ఓటమి ఎరగని మకుటము లేని రాజు శ్రీకృష్ణదేవరాయలు. వీరిని స్మరించుకుంటే రోమాలు నిక్కబడుచుకుంటాయన్నారు. .ఈ కార్యక్రమంలో బలిజ సంఘము అధ్యక్షులు కమతము శ్రీను,దుత్తా బాల ఈశ్వరయ్య సొసైటీ బ్యాంకుచైర్మన్ .గిద్దలూరు బిజెపి నాయకులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్, సూరే కొండయ్య, ముద్దర్ల శ్రీనివాసులు,బి వాసు, ఎం ఎల్ ఒ వెంకటేశ్వర్లు, జానకి రంగనాయకులు, కెప్టెన్ ప్రసాద్, వై. రంగయ్య లు పాల్గొన్నారు .

## తస్మాత్ జాగ్రత్త
## లింకులు క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ..!

### సైబర్ మోసాలపై గిద్దలూరు సురేష హెచ్చరిక

**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 17**



వాట్సాప్ గ్రూపుల్లో ఇటీవల నాకు రూ.5 వేలు వచ్చాయి. నమ్మలేకపోయాను.. మీరు కూడా ట్రై చేయండి.. అంటూ వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని గిద్దలూరు. పట్టణ సిఐ సురేష్ ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఇలాంటి మెసేజ్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసి బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు కొల్లగొడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులను ఓపెన్ చేయకుండా ఉండాలని సూచించారు. అలాగే, తెలియని నెంబర్ల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయడం, ఫార్వర్డ్ చేయడం వంటి చర్యల వల్ల మొబైల్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉండటంతో పాటు, ఖాతాల నుంచి డబ్బులు పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద లింకులు వస్తే వెంటనే వాటిని డిలీట్ చేసి, అవసరమైతే సైబర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కె సురేష్ సూచించారు.

## కొమరోలు మండలంలో ప్రశాంత వాతావరణంలో ముగిసి సంక్రాంతి పర్వదిన వేడుకలు

### సమస్యాత్మక గ్రామాలలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరివేక్షించిన ఎస్సై నాగరాజు

**కొమరోలు పెన్ పవర్ జనవరి 17**



కొమరోలు మండలంలోని అన్ని గ్రామాలలో సంక్రాంతి పర్వదిన వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని కొమరోలు ఎస్సై జే నాగ రాజు తెలిపారు. మూడు రోజులు జరిగే సంక్రాంతి వేడుకలను తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి బంధుమిత్రులు తరలి రావడంతో గ్రామాలు జనంతో నిండి కళకళలాడాయని ఆయన తెలిపారు. ఇక పండుగ సందర్భంగా గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, కోడి పందాలు, పేకాట తదితర జూదాలకు అవకాశం లేకుండా నిఘాలు ఏర్పాటు చేసి అవసరమైన గట్టి చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. కాగా మార్కాపురం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, మార్కాపురం డి.ఎస్.పి నాగరాజు, గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య ఆదేశాలు, సూచనల మేరకు మండలంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆ గ్రామాలలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించామని ఆయన తెలిపారు. దీనితో మండలంలోని అన్ని గ్రామాలలో సంక్రాంతి పర్వదిన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిశాయని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

# పి.గుడిపాడులో విషాదం: రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకుల మృతి

### అంత్యక్రియల్లో పాల్గొన్న వైసిపి ఇన్చార్జి డాక్టర్.అశోక్ కుమార్

### మృతుల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి









**అద్దంకి ఆర్.సి ఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 17:**

కొరిశపాడు మండలం, పి.గుడిపాడు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పి.గుడిపాడు సర్పంచ్ తాడి. కృష్ణమూర్తి మాతృమూర్తి తాడి. మహాలక్ష్మి (73), సోదరుడు తాడి. వెంకయ్య (55) మృతి చెందడం స్థానికులను కంటతడి పెట్టించింది. శనివారం జరిగిన వీరి అంత్యక్రియల్లో అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ పాల్గొని ఘన నివాళులర్పించారు.

**ఘటన వివరాలు...:** శుక్రవారం మధ్యాహ్నం తాడి వెంకయ్య, ఆయన తల్లి మహాలక్ష్మి వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై అద్దంకి వెళ్తుండగా, మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం క్రాస్ రోడ్డు వద్ద వెనుక నుండి అతివేగంగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వీరిని ఆసుపత్రికి తరలిస్తుండగా



మార్గంమధ్యలోనే ఇద్దరూ మృతి చెందారు. ఈ ఘటనపై మేదరమెట్ల ఎస్.ఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**పరామర్శించిన డా. అశోక్ కుమార్**

ఒకే కుటుంబంలో తల్లీకొడుకులు మృతి చెందడంతో సర్పంచ్ కృష్ణమూర్తి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. శనివారం పి.గుడిపాడులో జరిగిన అంత్యక్రియలకు హాజరైన వైఎస్ఆర్సీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్, మృతుల భౌతికకాయాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ కృష్ణమూర్తిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో అశోక్ కుమార్ వెంట కొరిశపాడు మండల వైఎస్ఆర్సీపీ కన్వీనర్ పాలపర్తి. శ్రీధర్ (చిట్టి), స్థానిక వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా 'మన అమ్మకు మనసారె మనసారా'

### - విశేషంగా తరలివచ్చిన మహిళలు



**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 17**

కనిగిరి పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతులు శ్రీశివస్వామి దివ్య ఆశీస్సులతో శ్రీ శైవ క్షేత్ర వనిత శక్తి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ' మన అమ్మకు మనసారె మనసారా ' కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మన అమ్మకు మనసారె మనసారా కార్యక్రమం జిల్లా అధ్యక్షురాలు కనమర్లపూడి లక్ష్మీమోహన్ మాట్లాడుతూ 24 మంది అమ్మవార్లకు ఒక్కొక్క నెల ఒక్కొక్క అమ్మవారికి మన అమ్మకు మనసారె మనసారా అందజేయడం జరుగుతుందని అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తొలిసారి శ్రీదేవి తల్లికి తొలి సారె అందజేస్తున్నట్లు తెలిపారు. అంగరంగ వైభవంగా శ్రీదేవి అమ్మవారికి చీర, జాకెట్లు, పసుపు కుంకుమ, స్వీట్స్ హాట్స్, పూలు అమ్మవారికి పూలదండ 20 రకాల ఐటమ్స్ తోటి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమానికి విశేషంగా మహిళలు తరలివచ్చారు. ఈసందర్భంగా కమిటీ నేతృత్వం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి సహకరించిన ఆలయ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. పూజా కార్యక్రమాలను కార్యక్రమ అధ్యక్షులు మునగా ఉమా శివలక్ష్మి, కార్యదర్శి గర్రె శిరీష, కోశాధికారి చక్కా హేమలత తదితరులు పర్యవేక్షించారు.

## హసనాపురంలో బోనేని వెంకటయ్య మృతదేహం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

**కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తండ్రి బోనేని వెంకటయ్య మృతి.**

**తీవ్ర సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి సానుభూతి ప్రకటించిన తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు.**



**కొమరోలు పెన్ పవర్ జనవరి 17.**

కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తండ్రి బోనేని వెంకటయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 15వ తేదీ రాత్రి కన్నుమూశారు .దీనితో బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ కుటుంబంలో, హసనాపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తండ్రి వెంకటయ్య మృతి చెందారనే సమాచారం తెలుసుకున్న గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి , ఆయన సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ,గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, కొమరోలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి, ఎడమ కళ్ళు సహకార సంఘం చైర్ పర్సన్ బిజ్జం రవీంద్రారెడ్డి ,గిద్దలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు గజ్జలకొండ నారాయణ, బిజ్జాల తిరుమలరెడ్డి, షేక్ హసీనా ,బాదినేని పల్లె గ్రామ పంచాయతీ టిడిపి ఇన్చార్జి ముత్తుముల ఎల్లారెడ్డి ,కొమరోలు వార్డు మెంబర్ షేక్ సుభాని, తెలుగుదేశం పార్టీ నాయకులు పాలుగుళ్ల మల్లికార్జున్ రెడ్డి, న్యాయవాది విజయ కుమార్ రెడ్డి, తదితర నేతలు కార్యకర్తలు శుక్రవారం హసనాపురం గ్రామానికి వెళ్లి బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ను ఓదార్చి ధైర్యం చెప్పి, వెంకటయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెంకటయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని, వెంకటేశ్వర్లు కుటుంబం ఈ దుఃఖ సాగరం నుంచి త్వరగా కోలుకోవాలని వారు ప్రార్థించారు. శుక్రవారం సాయంత్రం వెంకటయ్య మృతదేహానికి కుటుంబ సభ్యులు ,బంధుమిత్రులు కన్నీటి వీడ్కోలు పలికి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల కార్యక్రమంలో హసనాపురం గ్రామం తో పాటు తాటిచర్ల పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ,బోనేని అభిమానులు పాల్గొన్నారు.



## నేరల నియంత్రణపై సమీక్ష..!!



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 17**

గిద్దలూరు రూరల్ పోలీస్ స్టేషన్ లో శనివారం నేరాల నియంత్రణపై గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాచర్ల ఎస్ఐ కోటేశ్వరరావు, కొమరోలు ఎస్ఐ నాగరాజు లకు సీఐ రామకోటయ్య రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు అరికట్టడంపై పలు సూచనలు చేశారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపకుండా నిరోధించాలని,మైనర్లు కు ద్విచక్ర వాహనాలు ఇచ్చిన యజమానులకు భారీ జరిమానాలు విధించాలని ఆదేశించారు.

## బీసీ కాలనీలో వీధి లైట్లకు మరమ్మతులు



**గుడ్లూరు, పెన్ పవర్, జనవరి 17**

మండల కేంద్రమైన గుడ్లూరు బీసీ కాలనీలో స్థానిక సర్పంచ్ పాలకీర్తి శంకర్ వీధిలైట్లకు మరమ్మతులు శనివారం చేయించారు. పంచాయితీ అభివృద్ధి పనుల్లో భాగంగా గత కొన్ని రోజుల నుండి పంచాయతీ పరిధిలో వెలగని వీధిలైట్లపై దృష్టి సారించారు. దీనిలో భాగంగా బీసీ కాలనీలో వీధిలైట్లు వెలగడం లేదని సర్పంచ్ దృష్టికి రావడంతో, వెంటనే స్పందించిన సర్పంచ్, ఎలక్ట్రీషియన్ సహాయంతో వీధిలైట్లను వేయించారు. రిపేరుకు వీలుకాని చోట్ల నూతన లైట్లను అమర్చి బీసీ కాలనీలో వెలుగులు నింపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అద్దంకిలో సామాన్యులతో మమేకమైన మంత్రులు

## టీ తాగుతూ స్థానికులతో ఆత్మీయ సంభాషణ

## ప్రజల సమస్యలు తెలుసుకోవడమే ప్రభుత్వ లక్ష్యం





**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 17:**
ప్రజాప్రతినిధులు అంటే ప్రజలకు దూరంగా ఉండేవారు కాదని, సామాన్యులతో మమేకమై వారి సమస్యలు తెలుసుకున్నప్పుడే నిజమైన పాలన సాధ్యమవుతుందని రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు నిరూపించారు. దర్శి నియోజకవర్గ పర్యటనకు వెళ్తున్న క్రమంలో శనివారం అద్దంకిలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా. బాలవీరాంజనేయ స్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ (బుజ్జి), ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు తమ కాన్వాయ్‌ను ఆపి స్థానిక భవాని సెంటర్‌లోని ఓ టీ షాపు వద్దకు వెళ్లారు. అక్కడ సామాన్య ప్రజలతో కలిసి టీ తాగుతూ వారితో ముచ్చటించారు. స్థానికుల యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు, ప్రాంతీయంగా ఉన్న సమస్యలపైన ఆరా తీశారు. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే ఒక్కసారిగా తమ మధ్యకు వచ్చి సామాన్యుల్లా టీ తాగుతూ మాట్లాడటంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే సమర్థవంతమైన పాలనకు నిదర్శనమని అన్నారు. ప్రజా సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వారు స్పష్టం చేశారు. అనంతరం వారు దర్శి పర్యటనకు బయలుదేరి వెళ్లారు.

# నేడు అద్దంకి నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి పర్యటన

## ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ, అభివృద్ధి పనుల ప్రారంభం



**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 17**
కొరిశపాడు మండలం, బొడ్డువానిపాలెం గ్రామంలో ఆదివారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ పర్యటించ నున్నారు. ఆ మేరకు చిలకలూరిపేటలోని మంత్రి క్యాంపు కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆదివారం ఉదయం 10 గంటలకు బొడ్డువానిపాలెం చేరుకోనున్న మంత్రి, అక్కడ ఏర్పాటు చేసిన స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

# నేడు గుడ్లూరులో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



**గుడ్లూరు, పెన్ పవర్, జనవరి 17:**
తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి రాష్ట్ర ముఖ్య మంత్రి, విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి వేడుకలు మండల కేంద్రమైన గుడ్లూరులో ఆదివారం జరుగునని మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు శనివారం తెలిపారు. గుడ్లూరులో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఉదయం 8 గంటలకు ఈ కార్యక్రమం జరుగునన్నారు. కావున ఈ కార్యక్రమానికి మండలం పరిధిలో ఉన్న అన్నీ గ్రామాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళ నాయకులు, వివిధ కమిటీల సభ్యులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాగరాజు కోరారు.

# ఆరోగ్యానికి క్రీడలు ఎంతో మేలు

## రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ నేత అనిల్





పొదిలి, పెన్ పవర్, జనవరి 17,
ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో మేలు చేస్తాయని రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి వరి కుంట్ల అనిల్ కుమార్ అన్నారు. సంక్రాంతి పండుగ శుభ సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో శనివారం నాడు ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఎంతో కొంత సమయం కేటాయించి ఆటల పట్ల మక్కువ చూపించాలని సూచించారు. మానసిక ఉల్లాసానికి, దేహదారు ఢ్యానికి క్రీడలు ఎంతో మేలు చేస్తాయని అనిల్ కుమార్ చెప్పారు. క్రీడాకారులు సోదర భావంతో మెలిగి క్రీడలను ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆయన కోరారు. క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి 30 , 116 రూపాయల బహుమతిని అనిల్ కుమార్ స్పాన్సర్ చేయడం జరిగింది. అలాగే రెండవ బహుమతి 20, 116 రూపాయల బహుమతిని స్పాన్సర్ చేసిన పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా తో పాటు పలువురు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆనందోత్సవాలతో ముగిసిన సంక్రాంతి వేడుకలు

## మూడు రోజుల సంక్రాంతి పర్వదినాలను ఘనంగా జరుపుకున్న ప్రజలు

**కొమరోలు పెన్ పవర్ జనవరి 17**
కొమరోలు మండలంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈనెల 14న భోగి, 15న మకర సంక్రాంతి, 16వ తేదీన కనుమ పండుగ లను ప్రజలు ఆనంద ఉత్సవాలతో, ఘనంగా నిర్వహించుకున్నారు. ఆ సందర్భంగా ఆలయాలు భక్తులతో నిండి కళకళలాడాయి. గృహాలు బంధుమిత్రులతో కలకలలాడి పిండివంటలతో ఘుమఘుమ లాడాయి .ఇక దూర ప్రాంతాల నుంచి స్థానికులు, బంధుమిత్రులు స్వగ్రామాలకు చేరుకోవడంతో గ్రామాలలో సందడి వాతావరణం నెలకొన్నది. సంక్రాంతి పర్వదిన సందర్భంగా పలు గ్రామాలలో పలు రకాల పోటీలు నిర్వహించి యువతి యువకులను ఉత్సాహపరిచారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేసి ఆనంద ఉత్సవాలలో మునిగి తేలారు. కోలాటాలు, చెక్కభజన పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామాలు కళకళలాడాయి. కనుమ పర్వదిన సందర్భంగా పలు గ్రామాలలో దేవతమూర్తుల విగ్రహాలను గ్రామాల వెలుపలుకు తరలించి పారు వేట నిర్వహించారు. అక్కడ యువతీ యువకులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆ కార్యక్రమాలను తిలకించేందుకు గ్రామంలోని ప్రజలందరూ గ్రామాలు వెలుపలికి తరలి వెళ్లడంతో పారువేట ప్రాంతం జనంతో కిక్కిరిసిపోయింది. అనంతరం గ్రామాలలో గ్రామోత్సవం నిర్వహించారు. కొమరోలు పట్టణంలోని పట్టాభి రామస్వామి ఆలయం వద్ద నుంచి దేవత మూర్తుల విగ్రహాలతో భక్తులు గ్రామాల వెలుపలకు తరలివెళ్లి పారువేట నిర్వహించారు. అక్కడ యువకులకు పరుగు పందెం పోటీలు నిర్వహించి మీ చేతులకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి పర్వదిన వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొమరోలు ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షించారు.



# విద్యుత్ టారిఫ్ లపై ప్రజాభిప్రాయ సేకరణ

## - విద్యుత్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 17**
2026-2027 ఆర్థిక సంవత్సరానికి వినియోగ దారుల విద్యుత్ టారిఫ్ నిర్ణయించటానికి ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్సి) వారు ఈ నెల 20 న తిరుపతిలో, 22,23 తేదీలలో విజయవాడలో 27 న కర్నూలులో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్సి) ఆధ్వర్యంలో 2026-2027 సంవత్సరానికి విద్యుత్ టారిఫ్ సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో పైన తెలుపబడిన తేదీలలో అన్ని విద్యుత్ డివిజన్, సర్కిల్ కార్యాలయాలలో ప్రజభిప్రాయ సేకరణ చేపడుతున్న ట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ నెల 20 న తిరుపతిలో, 22,23 తేదీలలో విజయవాడలో 27 తేదీన కర్నూలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యక్షంగా, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విద్యుత్ వినియోగదారులు వారి అభిప్రాయాలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా నుంచి ఒంగోలు సర్కిల్ కార్యాలయంలో, కందుకూరు డివిజన్, కనిగిరి డివిజన్, దర్శి డివిజన్, మార్కాపురం డివిజన్ కార్యాలయాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమంలో పాల్గొని వారి అభిప్రాయాలను మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 లోపు తెలియజేయాలని సూచించారు. వినియోగదారుల అభిప్రాయాలను ఏపిఈఆర్సి వెబ్సైట్లో కూడా అప్లోడ్ చేయవచ్చుని, వ్యక్తిగతంగా తెలియజేసే వినియోగదారులు ముందుగా వారి పేర్లను ఏపిఈఆర్సి సెక్రటరీ వద్ద రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని వారి అభిప్రాయాలను తెలియజేయాలని ఎస్ఈ తెలిపారు.




# జిల్లా జాయింట్ కలెక్టర్ ను కలసిన తహసిల్దార్ కృష్ణారెడ్డి




**పొదిలి, పెన్ పవర్, జనవరి 17**
మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ ను మండల తహసిల్దార్ ఎం వి కృష్ణారెడ్డి కలుసుకున్నారు. మార్కాపురం జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ గా పులి శ్రీనివాసులు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం నాడు మండల తహసిల్దార్ ఎం వి కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలసి, శాలువాతో సత్కరించి తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కృష్ణారెడ్డి తో పాటు విఆర్ఓ సుబ్బారావు తదితరులు ఉన్నారు.


# డ్యూటీకి అని వెళ్లిన యువతి అదృశ్యం.. కేసు నమోదు



**అద్దంకి ఆర్సి ఇన్చార్జ్, పెన్ పవర్, జనవరి 17**
డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన అద్దంకి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అద్దంకి మండలం, నాగులపాడు గ్రామానికి చెందిన కొప్పుల శ్రీనివాసరావు, సౌజన్య దంపతుల కుమార్తె నిహారిక అద్దంకి పట్టణంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తోంది. ?ఈ నెల 12వ తేదీన (12.01.2026) ఉదయం సుమారు 09.30 గంటల సమయంలో రోజులాగే డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. అయితే, రాత్రి అయినా ఆమె ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ?దీంతో ఆందోళన చెందిన తల్లి సౌజన్య శనివారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ?బాధితుల ఫిర్యాదు మేరకు సి.ఐ సుబ్బరాజు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అర్చక,పురోహితులకు పంచాంగములు వితరణ

**కందుకూరు పెన్ పవర్, జనవరి 17**
శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కందుకూరు మండలం కొండముడుసుపాలెం గ్రామంలోని శ్రీ శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో పరిసర ప్రాంత మండలాలలోని 60 మంది అర్చక,పురోహితులకు పంచాంగములను ఆలయ ప్రధాన అర్చకులు వాకాని శ్రీనివాసాచార్యులు, నారాయణం రాధాకృష్ణమా చార్యులు, సంస్థ ప్రతినిధి దీవి గాయత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవాస భారతీయులు రామిరెడ్డి వేంకటరామిరెడ్డి,హైమావతమ్మ కుటుంబ సభ్యుల ఆర్థిక సౌజన్యంతో పంచాంగములను పంపిణీ చేయడం చాలా సంతోషమన్నారు. దైవిక,శుభ,అశుభ కార్యక్రమాలలో హైందవ ధర్మంలో ప్రధానంగా ఉపయుక్తకరమైన పంచాంగములను అందించడం ముదావహమన్నారు. ఈ సంధర్భంగా దాతలకు,సంస్థ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు, అభ్యుధయ, పిన్నంరాజు వేణుగోపాల్,కందుకూరు కిషోర్ ఆచార్యులు, గణపతిరాజు నాగరాజు,కారంపూడి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# నువ్వు బచ్చావు నేను ఎమ్మెల్యేను నాపై విర్రవీగితే నీ ఆరోగ్యానికి మంచిది కాదు మెంటల్‌గా నీ ఆరోగ్యం క్షినిస్తుంది

## అమనిగుడిపాడులో దళితుల షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యాగాలు అమ్ముకున్నావు

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జనవరి 17**
నువ్వు సర్పంచ్ కాదు కనీసం ఎంపీటీసీ కాదు నేను ప్రజల ఓట్లతో వారి మద్దతుతో గెలిచిన ఎమ్మెల్యే ను నువ్వా నన్ను విమర్శించేది అంటు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ టీడీపీ ఇంచార్జి ఎరీక్షన్ బాబును ఘాటుగా విమర్శించారు.శనివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రోటో?కాల్ గురించి నా హక్కు గురించి నేను మాట్లాడితే నువ్వు శిలాఫలకాల గురించి మాట్లాడుతున్నావు నేను ఇంచార్జి గా వున్నప్పుడు వేయించుకున్న శిలాఫలకం చూపించు అంటు ఛాలెంజ్ విసిరారు.నీకంటే బలంగా మాట్లాడగలను నువ్వు చేసే దాష్టికాలగురించి ప్రజలు అసహించుకుంటున్నారు నాపై విర్రవిగితే నీ ఆరోగ్యానికి మంచిదికాదని అన్నారు. మార్కాపురం, కనిగిరి, ప్రాంతాలలో నీ బినామీ పేర్లతో కూడబెట్టుకున్న అక్రమ ఆస్తుల చిట్టావిప్పితే మెంటల్ గా నీ ఆరోగ్యం క్షిణిస్తుందని, ఆమనీగుడిపాడులో షిఫ్ట్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న దళితులను తొలగించి, ఆ ఉద్యోగాలను అమ్ముకున్నావని దుయ్యి పట్టారు.తహసీల్దార్ కార్యాలయంలొ బాధ్యత లేకుండా కబడ్డీ పోటీలు నిర్వహించడం, డాన్స్ బేబీ డాన్స్ లు, పెట్టడం కాదు సంపాదించినా అవినీతి సొమ్ములొ కొంతైనా ప్రజల కోసం ఖర్చు పెట్టు అని అన్నారు.దోర్నాల ఆత్మకూరు రోడ్డు శాంక్షన్ కాలేదు, వెలిగొండ ప్రాజెక్టు నిర్వసితులకు నష్ట పరిహారం ఇప్పించలేదు, ఇష్టకామేశ్వరి గుడివద్దా త్రాగునీటి సమస్య పరిష్కరించలేదు కానీ, గతంలో ప్రారంభోత్సవాలు చేసిన వాటినే చెల్లికి మళ్ళీ పెళ్లి అన్నట్లుగా చేస్తున్నావని విమర్శించారు. జాతి ఔనత్యం ప్రపంచానికి తెలిసేలా, రైతన్నలకు గౌరవం ఇస్తూ జాతీయ స్థాయి ఎడ్ల పందేలు అందరి సహకారంతో గర్వంగా నిర్వహించమన్నారు. కొడుకు రాస్తున్న వెర్రిబుక్కు ఎర్రబుక్కు రాజ్యాంగం కాలాదన్ని,రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పతనం ఎలా ఉండబోతుందో యర్రగొండపాలెం నుంచి ప్రజలు చూసారన్నారు.ఈ కార్యక్రమంలొ వైస్సార్సీపీ జిల్లా సహాయ కార్యదర్శి ఒంగోలు మూర్తి రెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, దోర్నాల మండల అధ్యక్షులు గంటా వెంకట రమణారెడ్డి, ఆళ్ల ఆంజినేయ రెడ్డి, సింగారెడ్డి పోలీరెడ్డి, ఐ వి సుబ్బారావు, యస్ వి రమేష్,భూమిరెడ్డి సుబ్బారెడ్డి,లింగంగుంట్ల రాములు, సింగా ప్రసాద్, మహ్మద్ ఖాసీం,యక్కలి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే ఇంటూరుని కలిసిన గోరంట్ల గోపాల్




**కందుకూరు పెన్ పవర్, జనవరి 17:**
కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ని లింగసముద్రం మండలం మొగిలిచర్ల గ్రామ టిడిపి నాయకులు గోరంట్ల గోపాల్ శనివారం సాయంత్రం కందుకూరులో టిడిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కి గోపాల్ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## జాయింట్ కలెక్టర్‌తో మాగుంట భేటి



**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ జనవరి 17**
ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ ని మర్యాదపూర్వకంగా కలెక్టరేట్లో కలిశారు. పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై జాయింట్ కలెక్టర్ తో చర్చించారు.

## రికార్డులను పరిశీలించిన డిఆర్ఓ



**కలెక్టరేట్ ఒంగోలు,పెన్ పవర్ జనవరి 17**
శనివారం జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు కలెక్టరేట్ లోని రికార్డు రూమును సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఇటీవల జిల్లాల పునర్విభజనలో భాగంగా ప్రకాశం జిల్లా నుండి నూతనంగా మార్కాపురం జిల్లా ఏర్పడినందున, మార్కాపురం జిల్లాకు సంబంధించిన రికార్డులను సదరు జిల్లాకు పంపుటలో భాగంగా రికార్డుల విభజన ప్రక్రియను జిల్లా రెవెన్యూ అధికారి, సంబంధిత సెక్షన్ అధికారులతో కలసి పరిశీలించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంట కలెక్టరేట్ ఎఓ టి రవి, సంబంధిత సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లి జయరావు కాంస్య విగ్రహ ఆవిష్కరణ



**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 17**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను అవగాహన చేసుకుని బడుగు బలహీన వర్గాల ప్రజలకు జ్ఞానమే సంపదగా భావించి గ్రామంలోని ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరు చదువుకోవాలని తన జీవితకాలం ప్రజలను చైతన్యపరిచిన పిల్లి జయరావు కాంస్య విగ్రహం ఏర్పాటులో గ్రామస్తులందరూ కలిసి రావడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్ పేర్కొన్నారు. సూరారెడ్డిపాలెం -- ఈతముక్కల రహదారిలో కొత్తపట్నం మండలం సంకువాని గుంట వద్ద ఏర్పాటుచేసిన పిల్లి జయరావు కాంస్య విగ్రహాన్ని శనివారం ప్రొఫెసర్ డా. కసుకుర్తి జగదీష్ బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ జయరావు మాస్టారు మొదటి నుండి వామపక్ష భావజాలంతో ప్రజల పక్షపాతిగా వ్యవహరించారనీ, జయరావు మాస్టారు, డి.టి.మోజెస్ నిర్విరామంగా చేసిన కృషి కారణంగా గ్రామంలో దాదాపు అందరూ విద్యావంతులై ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దబడ్డారనీ ఆయన తెలిపారు. సిపిఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటరావు మాట్లాడుతూ జయరావు మాస్టారు కుటుంబ బాధ్యతను, వృత్తి ధర్మాన్ని, వామపక్ష రాజకీయాలను, ప్రజల సమస్యలను కలగలిపి తన జీవితాన్ని సమాజ శ్రేయస్సు కోసం పాటుపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జయరావు మాస్టర్ భార్య పిల్లి విజయమ్మ, కుమారుడు పిల్లి రవికుమార్, కుమార్తె తానికొండ జన్నమ్మ, పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళీ, డి.యం.ఆర్ శేఖర్, పిల్లి లాజర్, చిడితోటి కోటేశ్వరరావు, చక్కా రత్నాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అల్లినగరంలో ఆనందోత్సవాలతో ముగిసిన సంక్రాంతి వేడుకలు

**కనుమ పండుగ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించిన పంచాయతీ ప్రథమ పౌరురాలు సర్పంచ్ బంగారు రత్నాలు.**

**తొలి కొబ్బరికాయ కొట్టి పూజా కార్యక్రమాలకి ప్రారంభోత్సవం చేసిన సర్పంచ్.**





**కొమరోలు పెన్ పవర్ జనవరి 17**
కొమరోలు మండలం అల్లినగరం గ్రామంలో సంక్రాంతి పర్వదిన వేడుకలు అత్యంత ఆనందోత్సవాలతో ఘనంగా జరిగాయి. భోగి పండుగ సందర్భంగా అల్లినగరం పంచాయతీలోని ప్రజలు భోగిమంటలు వేసి సంక్రాంతి వేడుకలకు స్వాగతం పలికారు. కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆ గ్రామంలోని పట్టాభి రామస్వామి ఆలయంలో గ్రామపంచాయతీ ప్రథమ పౌరుడు, ఆ గ్రామ సర్పంచ్ తొలి కొబ్బరికాయ కొట్టి పూజా కార్యక్రమాలను ప్రారంభించడం ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయం. ఆ గ్రామానికి చెందిన బంగారు వెంకటేశ్వర్లు సతీమణి, గిద్దలూరు నియోజకవర్గం వైసిపి నాయకులు బంగారు విశ్వరూపం వదినగారైన బంగారు రత్నాలు 2020లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో అల్లినగరం గ్రామ సర్పంచిగా ఘన విజయం సాధించారు .అప్పటినుంచి ప్రతి సంవత్సరం ఆ గ్రామ సర్పంచ్, గ్రామపంచాయతీ ప్రథమ పౌరురాలైన బంగారు రత్నాలు సంక్రాంతి వేడుకల సందర్భంగా కనుమ పండుగ రోజున ఆ గ్రామంలోని పట్టాభి రామస్వామి ఆలయంలో తొలి కొబ్బరికాయ కొట్టి పూజా కార్యక్రమాలను ప్రారంభిస్తూ వస్తున్నారు. గతంలో ఆ గ్రామంలో నెలకొన్న రాజకీయ విద్వేషాల కారణంగా పట్టాభి రామస్వామి ఆలయంలో తొలి కొబ్బరికాయ కొట్టేందుకు గ్రామ సర్పంచి బంగారు రత్నాలకు అవరోధాలు కల్పించినప్పటికీ, పట్టు వదలని విక్రమార్కుడి వలె బంగారు విశ్వరూపం కోర్టును ఆశ్రయించి అనుకూలమైన తీర్పును పొందారు. అప్పటినుంచి బంగారు రత్నాలు పంచాయతీ ప్రథమ పౌరురాలుగా కనుమ సంక్రాంతి రోజున ఆ గ్రామంలోని పట్టాభి రామస్వామి ఆలయంలో తొలి కొబ్బరికాయ కొట్టి పూజా కార్యక్రమాలను ప్రారంభిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా శు క్రవారం కనుమ పండుగ సందర్భంగా ఆ గ్రామంలోని దేవాలయంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాలలో పాల్గొనేందుకు బంగారు రత్నాలు, బంగారు విశ్వరూపం, బంగారు వెంకటేశ్వర్లు ,ఆ గ్రామ మాజీ ఎంపిటిసి సభ్యురాలు బంగారు నారాయణమ్మ తదితర కుటుంబ సభ్యులు బంగారు విశ్వరూపం అభిమానులు, వైసీపీ నేతలు కార్యకర్తలు మేళతాళాలతో సర్పంచ్ ఇంటి నుంచి బయలుదేరి పట్టాభి రామస్వామి ఆలయానికి చేరుకున్నారు .ఆలయంలో సర్పంచి బంగారు రత్నాలు తొలి కొబ్బరికాయ కొట్టి భర్త వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు, వేద పండితులు బంగారు రత్నాలు దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజా కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి ఆశీర్వదించారు. అనంతరం ఆ గ్రామానికి చెందిన పలువురు ఆలయంలో కొబ్బరికాయలు కొట్టి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో పారువేట కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో సంక్రాంతి పర్వదినాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కొమరోలు ఎస్సై నాగరాజు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

# మొన్న ,నిన్న కలకలలాడి.. నేడు కళావిహీనంగా మారిన పల్లె సీమలు

**తిరుగు ప్రయాణమై వెళ్లిన స్థానికులు, బంధుమిత్రులు.**

**సంక్రాంతి వేడుకలకు దూర ప్రాంతాల నుంచి తరలిరావడంతో కళకళలాడిన గ్రామాలు.**

**మూడు రోజుల సంక్రాంతి వేడుకల అనంతరం తిరుగు ప్రయాణమై వెళ్లిపోయిన బంధుమిత్రులు.**

**కొమరోలు పెన్ పవర్ జనవరి 17**
సంక్రాంతి పర్వదిన వేడుకలను పురస్కరించుకొని గత మూడు రోజులుగా బంధుమిత్రులతో కలకలలాడిన గ్రామాలు, నేడు కళాహీనంగా మారాయి. సంక్రాంతి పర్వదిన వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు దూర ప్రాంతాలలోని ప్రజలు స్వగ్రామాలకు గత మూడు రోజుల క్రితం చేరుకున్నారు. వారితోపాటు బంధుమిత్రులు, కూతుళ్లు, అల్లుళ్లు, కుమారులు కోడళ్ళు ,మనమండ్లు, మనుమరాండ్లు గ్రామాలకు చేరడంతో గ్రామాలు కొత్త కళ ను సంతరించుకున్నాయి. భోగి ,మకర సంక్రాంతి, కనుమ పండుగలను గ్రామస్తులు బంధుమిత్రులతో కలసి ఆనందోత్సవాలతో జరుపుకున్నారు .ఆ సందర్భంగా గృహాలు పిండివంటలతో ఘుమ ఘుమ లాడగా, పలు రకాల పోటీలు, గాలిపటాల ఎగురువేత ,సాంస్కృతి కార్యక్రమాలు, కోలాటాలు, ఆలయాల సందర్శన తదితర కార్యక్రమాలతో ప్రజలు బంధుమిత్రులు ఆనందోత్సవాలను




పంచుకున్నారు. కాగా సంక్రాంతి పర్వదిన వేడుకలను శుక్రవారంతో ముగియటంతో శనివారం ఉదయం నుంచి బంధుమిత్రులు తిరుగు ప్రయాణమయ్యారు. దీనితో మొన్న నిన్న కళకళలాడిన పల్లె సీమలు, నేడు కళా విహినంగా మారి బోసిపోయినట్లు కనిపించాయి.

# నేడు ఘనంగాఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

**-ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు - వెంగమాంబ కళ్యాణ మండపంలో కార్యక్రమం**

**-రక్తదాన శిబిరంలో భాగస్వాములు కావాలని పిలుపు**



**కందుకూరు పెన్ పవర్, జనవర్ 17:**
నేడు కందుకూరు పట్టణంలో నిర్వహించబోయే స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలకు పెద్ద ఎత్తున తరలిరావాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని స్థాపించిన తక్కువ కాలంలోనే అధికారంలోకి వచ్చి, ప్రజలు శాశ్వతంగా గుర్తుపెట్టుకునేలా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన చరిత్ర స్వర్గీయ ఎన్టీఆర్ గారిదని పేర్కొన్నారు. సినీ రంగంలో కూడా రారాజుగా వెలుగొందారని, అందుకనే ఆయన్ను తెలుగు ప్రజలు ఆరాధ్య దైవంగా ఇప్పటికీ భావిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించబోతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎన్టీఆర్ 30 వర్ధంతి వేడుకలను కందుకూరు పట్టణంలో ఈ నెల 18వ తేదీ ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించబోతున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన అనంతరం, అక్కడి నుంచి వెంగమాంబ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు. ఫంక్షన్ హాల్ లో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఆపద సమయాల్లో రోగుల ప్రాణాలు కాపాడేందుకు రక్తం అవసరమవుతుంది కాబట్టి, నాయకులు, కార్యకర్తలు, యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల భాగస్వామ్యం కూడా ఉంటుందన్నారు. కార్యక్రమం అనంతరం భారీ అన్నదానం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అన్నగారి అభిమానులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంట పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, అల్లం వెంకటేశ్వర్లు, చిలకపాటి మధుబాబు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, షేక్ రూబీ, రాయపాటి శ్రీనివాసరావు, రవిచంద్ర, నరేంద్ర ముచ్చు శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి తదితరులు ఉన్నారు.

# పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు

**- మధ్యవర్తుల మాటలు నమ్మవద్దు - సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్**

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 17**
రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి సూచన మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, ఒంగోలు నందు పనిచేసేందుకు రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలు - 3, ఫ్రంట్ ఆఫీస్, కోఆర్డినేటర్ - 1, డేటా ఎంట్రీ ఆపరేటర్-1 రెగ్యులర్ పద్ధతిలో నియామకాలు దరఖాస్తు ఆహ్వానించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఓసి క్యాటగిరీకి రెండు ఎస్సీ కేటగిరి లోని గ్రూపు 1 ఒక ఉద్యోగం కేటాయించిన వీటికి విద్యా అర్హతగా పదవ తరగతి లేదా తత్సమానమైన పరీక్షలు ఉత్తీర్ణత పొంది ఉండాలని అదేవిధంగా ఫ్రంట్ ఆఫీస్ కో ఆర్డినేటర్, డేటా ఎంట్రీ ఉద్యోగులను ఓసి క్యాటగిరిలో భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. వీటికి విద్యార్హతగా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, కంప్యూటర్ పరిజ్ఞానం టైపింగ్ నాలెడ్జ్ కలిగి ఉండాలని డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగానికి అదనంగా ఎంఎస్ ఆఫీస్ నందు మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. ఈ నియామక ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని విద్యార్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, దరఖాస్తు రుసుము, సంబంధిత సిలబస్ కొరకు ప్రకాశం జిల్లా ఈ కోర్టు వెబ్సైట్ ద్వారా పొందవచ్చునని తెలిపారు. ఈనెల జనవరి 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు లోపు దరఖాస్తులను రిజిస్టర్ పోస్టు ద్వారా గాని స్పీడ్ పోస్ట్ ద్వారా గాని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఒంగోలు వారి కార్యాలయానికి అందే విధంగా పంపాలని సమయం దాటిన అప్లికేషన్లు తిరస్కరించబడతాయని తెలియజేశారు. ఈ నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకంగానూ ఎటువంటి పక్షపాతానికి తావు లేకుండా జరుగుతుందని మధ్యవర్తులను సంప్రదించవద్దని ఎటువంటి అనైతిక చర్యలకు పాల్పడవద్దని అన్నారు.

## శాఖవరంలో సంక్రాంతి సంబరాలు

**విజేతలకు బహుమతులు అందించిన**

**ఎమ్మెల్యే కుమారులు అవినాష్, సందీప్**



**వలేటివారిపాలెం పెన్ పవర్ జనవరి 17**
మండలం శాఖవరం గ్రామంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా ముగిశాయి. పండుగ వేడుకల్లో భాగంగా తెలుగుదేశం పార్టీ యువత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, ట్రాక్టర్ రివర్స్ పోటీలు, మ్యూజికల్ చైర్స్ నిర్వహించారు. చివరిగా చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కుమారులు అవినాష్, సందీప్ లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ పోటీల్లో విజేతలకు వారు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శాఖవరం గ్రామం తెలుగు యువత, మహిళలు పాల్గొన్నారు.

## పొదిలి కమిషనర్‌ను కలసిన ప్రముఖులు

**పొదిలి, పెన్ పవర్, జనవరి 17**
పొదిలి నగర పంచాయతీ కమిషనర్ మారుతి రావును పలువురు ప్రముఖులు కలుసుకున్నారు. ఆయన ఇటీవలనే పొదిలి మునిసిపల్ కమిషనర్ గా ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భాన్ని పునస్కరించుకొని శనివారం నాడు పలువురు కమిషనర్ మారుతి రావు ను కలసి, శాలువలతో సత్కరించి తమ శుభాకాంక్షలు తెలియజేశారు. కమిషనర్ మారుతి రావు ను కలుసుకున్న వారిలో రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి గునుపూడి భాస్కర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు సామి రాజా, మాదాల వారి పాలెం సహకార సంఘం డైరెక్టర్ బత్తిన ఓబయ్య, బత్తిన వెంకటరావు, తెలుగుదేశం యువ నాయకులు ముల్లా రబ్బాని, షేక్ గౌస్ భాష, ముల్లా గౌస్, మస్తాన్ రావు తదితరులు ఉన్నారు.







# ఖైదీలకు ఉచితంగా న్యాయవాది నియామకం

## – జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి.. న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్






**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 17**

జిల్లా జైలులో న్యాయవాదిని నియమించుకోలేని ఖైదీలకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అనే ప్రక్రియ ద్వారా ఉచితంగా న్యాయవాది ని నియమించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని అవసరం ఉన్న ప్రతి ఖైదీ వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. శనివారం జిల్లా జైలు ను సందర్శించిన న్యాయమూర్తి అక్కడ ఖైదీలకు అందుతున్న వసతి, భోజన సదుపాయాలను తనిఖీ చేశారు. అదేవిధంగా ఖైదీలకు చట్టపరంగా అందుతున్న అవకాశాలను వివరించారు. క్షణికావేశంలో తప్పులు చేయటం వల్ల తమ యొక్క అమూల్యమైన జీవితాన్ని వృధా చేసుకోవడమే కాకుండా తమ కుటుంబ సభ్యులకు దూరంగా ఉండటం వలన ఎంతో మానసికంగా క్షోభ అనుభవిస్తున్నారని భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు పర్యవేక్షణ అధికారి పి. వరుణ రెడ్డి, లీగల్ ఎయిడ్ న్యాయవాదులు జి. రవిశంకర్, పి. వీర రాఘవులు, డిప్యూటీ జైలర్ కె.ఎలమందరావు, డాక్టర్ బ్రహ్మ తేజ పాల్గొన్నారు.

# నేడేఎన్టీఆర్ గారి వర్ధంతి ఎమ్మెల్యే ముత్తుముల ఆధ్వర్యంలో “లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైమ..



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 17**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా, గిద్దలూరు శాసనసభ్యులు, ఒ ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని విట్టా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో ఉదయం 8.00 గంటలకు ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు , లెజండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ (మహా రక్తదానం) కార్యక్రమం నిర్వహించనున్నారు. కావున గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు నందమూరి అభిమానులు, యువకులు ఈ మహా రక్తదాన కార్యక్రమంలో విరివిగా పాల్గొని, రక్తదానం చేసి ఎన్టీఆర్ కు ఘణమైన నివాళులు అర్పిద్దాం అని తెలుగు దేశం పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# వేషం మార్చి..

## పేకాట రాయుళ్లు ను ఏమార్చి



**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 17**

ఊరికి దూరంగా పొలాల మధ్యలో ఎవరూ రారనుకున్న పేకాట రాయుళ్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు వేషాలు మార్చి పేకాట రాయుళ్లు ను ఏమార్చి అదుపులోకి తీసుకున్న ఘటన ఆలూరు గ్రామంలో శనివారం జరిగింది. పక్కా పల్లెటూరు వారిలాగా లుంగీలు కట్టుకుని టాస్ ఫోర్స్ పోలీసులు కొత్తపట్నం మండలం పరిధి ఆలూరు గ్రామ శివారులో కోతముక్క పేకాట ఆడుతున్న 6మందిని టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుండి రూ . 7100/–లు స్వాధీన పరుచుకొని కొత్తపట్నం పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ యు. సుధాకర్ ఆధ్వర్యంలో ఎస్సై సుదర్శన్ ,ఏఎస్ఐ మహబూబ్బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

# పొదిలిలో ముగిసిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

**పొదిలి, పెన్ పవర్, జనవరి 17**

పొదిలిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. గత పది రోజుల నుండి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. కాగా శనివారం నాటికి ఆయా పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతిని ఎన్ . బి. లెవెల్స్ జట్టు కైవసం చేసుకుంది. ఆ జట్టుకు మొదటి బహుమతి స్పాన్సర్ చేసిన 30 , 116 రూపాయల బహుమతిని రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్ తన చేతుల మీదుగా అందజేశారు. అదేవిధంగా రెండవ బహుమతి స్పాన్సర్ చేసిన 20, 116 రూపాయల బహుమతిని స్పాన్సర్ చేసిన పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస తన చేతుల మీదుగా రెండవ స్థానంలో నిలచిన జట్టుకు అందజేశారు. అలాగే మూడవ బహుమతి స్పాన్సర్ చేసిన 10,116 రూపాయల బహుమతిని పొదిలి మండల మాజీ అధ్యక్షులు మీగడ ఓబుల్ రెడ్డి తన చేతుల మీదుగా మూడవ స్థానంలో నిలచిన జట్టుకు అందజేశారు. అలాగే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా రాణించిన షేక్ నజీర్ కు 1,116 రూపాయల నగదు బహుమతిని మర్రిపూడి మండల పరిషత్ అధ్యక్షులు వాకా వెంకటరెడ్డి స్పాన్సర్ చేయడంతో పాటు స్వయంగా అందజేశారు. క్రీడా పోటీల నిర్వహణ కోసం డాక్టర్ స్వర్ణ గీత తనయుడు డాక్టర్ స్వర్ణ ప్రీతం కృష్ణ, తెలుగుదేశం మైనారిటీ నాయకులు షేక్ మౌలాలి తదితరులు తమ వంతు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం యువ నాయకులు వరికుంట్ల నిరంజన్, ముల్లా రబ్బాని తదితరులు పాల్గొన్నారు.



# కిటకిట లాడుతున్న రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్ స్టేషన్

**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 17**

పట్టణాల నుండి పల్లెలకు చేరుకొని గత మూడు రోజులుగా సంక్రాంతి పర్వదిన వేడుకలు పిల్లాపాపలతో బంధుమిత్రులతో జరుపుకుని కనుమ, పారువేట ను ముగించుకొని తిరిగి ఉద్యోగాలు నిర్వహించే పట్టణాలకు పిల్లలు , పాపలతో బయలుదేరాటం తో రైల్వేస్టేషన్ బస్ స్టేషన్ లు జనాలతో కిటకిట లాడి పోతున్నాయి. కాచిగుడా ట్రైన్, తిరుపతి ట్రైన్లు గిద్దలూరు హైదరాబాద్ ప్రయివేట్ ,ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నాయి. గిద్దలూరు , పరిసర గ్రామాల్లో గత మూడు రోజులుగా కళ కళ లాడినవి నేడు వెలవెల పోతున్నాయి. శు క్రవారం ఆటపాటలతో పండుగ శోభ నెలకొనగా లోగిళ్ళు అన్ని వెల వెల లాడుతున్నాయి. కొందరికి టిక్కెట్స్ బుక్ కాక , రైళ్లలో బస్సుల్లో సీట్లు దొరకక అక్కడే మరో వాహనం కోసం పడిగాపులు గాస్తున్నారు, గిద్దలూరు పట్టణ రైల్వే స్టేషన్ శనివారం ప్రయాణికులతో కిక్కిరిసి కనిపించింది. పల్లెల్లో పండుగలను కుటుంబ సభ్యులతో ఘనంగా జరుపుకున్న ప్రజలు తిరిగి ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువుల కోసం నగరాల వైపు బయలుదేరడంతో స్టేషన్‌లో ఎక్కడ చూసినా ప్రయాణికులతో నిండిపోయింది . రైళ్లు ఎక్కేందుకు ప్రయాణికులు పెద్ద ఎత్తున చేరడంతో స్టేషన్ పరిసరాలు సందడిగా మారాయి. బస్ లు కూడా కిక్కిరిసి స్టాండింగ్ తో వెళుతున్నాయి. సంక్రాంతి పండుగ వేడుకలు ముగిసిన తరువాత గిద్దలూరు పట్టణ రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసి కనిపించింది. పల్లెల్లో పండుగలను కుటుంబ సభ్యులతో ఘనంగా జరుపుకున్న ప్రజలు తిరిగి ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువుల కోసం నగరాల వైపు బయలుదేరడంతో స్టేషన్‌లో ఎక్కడ చూసినా జనసంద్రం నెలకొంది. రైళ్లు ఎక్కేందుకు ప్రయాణికులు పెద్ద ఎత్తున చేరడంతో స్టేషన్ పరిసరాలు సందడిగా మారాయి.



# నేడు ఎన్టీఆర్ వర్ధంతి

## ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే దామచర్ల



**కలెక్టరేట్ ఒంగోలు , పెన్ పవర్ జనవరి 17**


తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఒంగోలు నందు ఏర్పాటుచేసిన వర్ధంతి కార్యక్రమాల ఏర్పాట్లను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు పార్టీ శ్రేణులతో కలిసి శనివారం పరిశీలించారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ముందుగా స్థానిక అద్దంకి బస్టాండ్ వద్ద ఆధునికరించిన ఆయన విగ్రహం ప్రారంభోత్సవం,



అనంతరం గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద జరిగే వర్ధంతి సభ నిర్వహణ ఏర్పాట్లు పై దామచర్ల జనార్ధన్ సమీక్షించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ ఆదివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా అద్దంకి బస్ స్టాండ్ నందు ఎన్టీఆర్ విగ్రహం ప్రారంభోత్సవం, వర్ధంతిని ఘనంగా నిర్వహించుకోవాలని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, నందమూరి అభిమానులు ఈ కార్యక్రమం లో భాగస్వాములు అయ్యేలా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. రక్తదాన శిబిరం, అన్నదానశీ కార్యక్రమం విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిటీ బాధ్యులకు సూచించారు.

# పారిశుద్ధ్య కార్మికులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

## – సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు జనవరి 17**

మునిసిపల్ అధికారులు అధికారులు జోక్యం చేసుకొని విజయమ్మ పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయించేందుకు చర్యలు తీసుకుని, వెంటనే విధుల్లో కి తీసుకోవాలని సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి మహేష్ డిమాండ్ చేశారు.మునిసిపల్ కార్మికులపై జరిగిన వాడిని ఖండిస్తూ దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మునిసిపల్ కార్యాలయం లోని అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఒంగోలు నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య విభాగం మహిళా కార్మికులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు కె మోహన్ రావు ,బి. సంతోషము,ఆర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# 19వ తేదీ నుంచి ఉచిత పశు వైద్య శిబిరం

**పొన్నలూరు,పెన్ పవర్ జనవరి 17**

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ నుండి 31వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామపంచాయతీలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించబడుతుందని పశు వైద్యాధికారులు శివరామకృష్ణ, కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు, దూడలకు, మేకలకు గొర్రెలకు, గేదలకు ఉచితంగా నట్ట నివారణ మందులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పశువులకు పశు బీమా కూడా నమోదు చేయటం జరుగుతుందని అన్నారు.

# నితీష్ రెడ్డి అసలు ఆల్ రౌండరే కాదు: తెలుగు క్రికెటర్‌పై మహ్మద్ కైఫ్ షాకింగ్ కామెంట్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డిపై భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. నితీష్ కుమార్ రెడ్డి ఆల్ రౌండర్ కాదని.. అతను కేవలం బ్యాట్స్?మెన్ మాత్రమేనని అన్నాడు. బీసీసీఐ ఈ విషయాన్ని ఎంత త్వరగా అర్థం చేసుకుంటే వారికి అంత మంచిదని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆల్ రౌండర్ పేరుతో నితీష్ జట్టులో టీమ్ సెటప్ సరిగ్గా లేక కెప్టెన్?కు కంపర్టబుల్?గా ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశాడు. టీమ్?లో అతడు ఆరవ బౌలర్ కాదని.. నిజానికి అతనొక పార్ట్ టైమ్ బౌలర్ అని అభివర్ణించాడు. అసలు జట్టులో నితీష్ రెడ్డి పాత్ర ఏంటో నాకు అర్థం కావడం లేదని.. టీమిండియా కోచ్, మేనేజ్‌మెంట్ దయచేసి టీమ్?లో అతడి పాత్ర ఏంటో తనకు చెప్పాలని కోరాడు. రాజ్?కోట్ వేదికగా న్యూజిలాండ్?తో జరిగిన రెండో వన్డేలో టీమిండియా ప్లేయింగ్ లెవన్ ఎంపికపైన కైఫ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. నెమ్మదిగా ఉన్న రాజ్‌కోట్ పిచ్?పై టీమిండియా నలుగురు పేసర్లతో ఆడిందని.. కానీ పర్యాటక న్యూజిలాండ్ జట్టు రాజ్ కోట్ పిచ్ పరిస్థితులను బాగా అర్థం చేసుకుందన్నారు. స్పిన్ వారి బలం కాకపోయిన న్యూజిలాండ్ ఈ మ్యాచులో ముగ్గురు స్పిన్నర్లతో ఆడిందని గుర్తు చేశారు. అసలు రెండో వన్డే కోసం ఎంపిక చేసిన జట్టు వ్యూహమేంటో తనకు అర్థం కాలేదన్నాడు. అసలు జట్టులో నితీష్ కుమార్ రెడ్డి పాత్ర ఏంటని ప్రశ్నించాడు. నితీష్ అస్సలు ఆల్ రౌండరే కాదని కైఫ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కైఫ్ వ్యాఖ్యలపై

నితీష్ అభిమానులు మండిపడుతున్నారు. కాగా, రాజ్ కోట్ వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఓటమి పాలైన విషయం తెలిసిందే. పర్యాటక న్యూజిలాండ్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో ఈ మ్యాచులో గెలిచి సిరీస్?ను 1-1 సమం చేసింది. సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డే జనవరి 17న మధ్యప్రదేశ్ లోని ఇండోర్ వేదికగా జరగనుంది.

# ఇండియా ఓపెన్‌లో ముగిసిన భారత పోరాటం.. క్వార్టర్ ఫైనల్స్‌లో స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఓటమి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఇండియా పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన మెన్స్ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ 2117, 1321, 1821తో చైనీస్ తైపీకి చెందిన వరల్డ్ 13వ ర్యాంకర్ లిన్ చున్-యీ చేతిలో ఓడిపోయాడు. గంటా 8 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్‌ను గెలిచి శుభారంభం చేశాడు. కానీ తర్వాతి రెండు గేమ్స్‌లో అనూహ్యంగా తడబడిన సేన్.. అనవసర తప్పిదాలు చేశాడు. గురువారం జరిగిన మెన్స్ డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి 25-27, 21-23, 19-21తో హీరోకి మిడోరికావా -- క్యోహీ యామాషితా (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయింది. అయితే, మూడో గేమ్‌లో ఇరు జంటలూ 15-15తో సమానంగా ఉన్నప్పుడు ఒక షాట్ ఆడే క్రమంలో సాత్విక్ నెట్‌ను తాకాడని చైర్ అంపైర్ 'ఫాల్ట్'గా ప్రకటించడం వివాదాస్పదమైంది.

**స్టేడియంలో కోతులు, పక్షులు..షట్లర్ల ఇక్కట్లు..**

ఈ టోర్నీలో కాలుష్యం, చలి వంటి వాతావరణ సమస్యలతో పాటు ఇందిరా గాంధీ ఇండోర్‌స్టేడియంలో పక్షుల రెట్టలు పడటం, కోతులు ప్రత్యక్షమవ్వడం వంటి వింత సంఘటనలు నిర్వాహకులకు పెద్ద తలనొప్పిగా మారాయి. గురువారం హెచ్ ఎస్ ప్రణయ్ మ్యాచ్ సందర్భంగా పక్షుల రెట్టలు కోర్టులో పడటం వల్ల ఆట నిలిచిపోవడంపై ఆటగాళ్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.ఇక వాయు కాలుష్యం కారణంగా శ్వాస తీసుకోవడం కష్టమవుతోందని లో కీన్ యూ వంటి ఇంటర్నేషనల్ స్టార్లు ఫిర్యాదు చేశారు. ఈ విమర్శలపై స్పందించిన ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ స్టేడియం నిర్వహణలోని లోపాలను అంగీకరిస్తూనే, భవిష్యత్తులో జరగబోయే వరల్డ్ చాంపియన్‌షిప్ నాటికి ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి మెరుగైన వాతావరణాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చింది.

# డబ్ల్యూపీఎల్: బలమైన ముంబై ఇండియన్స్ ను ఓడించిన యూపీ వారియర్స్



- ముంబై ఇండియన్స్‌పై యూపీ వారియర్స్ 22 పరుగుల తేడాతో గెలుపు
- హాఫ్ సెంచరీలతో చెలరేగిన యూపీ బ్యాటర్లు మెగ్ లానింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్
- 188 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో తడబడిన ముంబై
- అమేలియా కెర్, అమన్‌జోత్ కౌర్ పోరాడినా ఫలితం శూన్యం
- యూపీ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌తో జట్టుకు విజయం

**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 సీజన్‌లో యూపీ వారియర్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శనివారం నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 22 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్‌లో కెప్టెన్ మెగ్ లానింగ్ (70), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (61) హాఫ్ సెంచరీలతో చెలరేగగా, అనంతరం బౌలర్లు కట్టుదిట్టంగా రాణించి జట్టుకు విజయాన్ని అందించారు. ముంబై జట్టులో అమేలియా కెర్, అమన్‌జోత్ కౌర్ చివరి వరకు పోరాడినా ఫలితం లేకపోయింది.

188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్, 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఛేదనలో ముంబై టాప్ ఆర్డర్ విఫలమవడంతో 69 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో అమేలియా కెర్ (28 బంతుల్లో 49 నాటౌట్), అమన్‌జోత్ కౌర్ (24 బంతుల్లో 41) ఆరో వికెట్‌కు 83 పరుగులు జోడించి పోరాడారు. అయితే, వీరిద్దరి పోరాటం జట్టును గెలిపించడానికి సరిపోలేదు. యూపీ బౌలర్లలో శిఖా పాండే రెండు వికెట్లు తీయగా, మిగతా బౌలర్లు సమష్టిగా రాణించి విజయంలో కీలక పాత్ర పోషించారు.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ కిరణ్ నవగిరె (0) డకౌట్ అయినా, కెప్టెన్ మెగ్ లానింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీరిద్దరూ ముంబై బౌలర్లపై ఆధిపత్యం చెలాయిస్తూ రెండో వికెట్‌కు 119 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. లానింగ్ 45 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 70 పరుగులు చేయగా, లిచ్‌ఫీల్డ్ 37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 61 పరుగులు చేసింది. ముంబై బౌలర్లలో అమేలియా కెర్ మూడు వికెట్లు పడగొట్టింది.

# నాగ్ 100 కోట్లు కొట్టాలంటే..







తెలుగు సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు టాలీవుడ్ కింగ్ నాగార్జున. కెరీర్ స్టార్టింగ్ నుంచే ప్రయోగాత్మక సినిమాలు, విభిన్న పాత్రలతో తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. అయితే గత కొన్నేళ్లుగా ఆయన చేసిన సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి. నాగార్జున స్క్రీన్ ప్రెజెన్స్ ను పూర్తిగా యూజ్ చేసుకోకపోవడమే అందుకు ప్రధాన కారణమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే నాగార్జున ప్రస్తుతం తన కెరీర్ లో 100వ సినిమాను చేస్తున్నారు. కింగ్ 100 అనే వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఆ చిత్రానికి తమిళ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఆ మూవీ.. యాక్షన్ ప్రధానంగా సాగుతుందని తెలుస్తోంది. సినిమాలో నాగార్జున లుక్, క్యారెక్టర్ పూర్తిగా కొత్తగా ఉంటుందని సమాచారం. కెరీర్ లో ల్యాండ్ మార్క్ మూవీ కావడంతో ప్రాజెక్ట్ పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.అదే సమయంలో నాగ్ కు రూ.100 కోట్ల హిట్ ఎప్పుడు సొంతమవుతుందోనని అంతా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటి వరకు కెరీర్ లో ఎన్నో సినిమాల్లో నటించినా.. ఆ మార్క్ అందుకోకపోవడం గమనార్హం. ఆయనతో పాటు సీనియర్ హీరోలు అయిన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ మాత్రం ఇప్పటికే పలు రూ.100 కోట్ల సినిమాలను తమ ఖాతాలో వేసుకున్నారు. దీంతో నాగార్జున అభిమానుల్లో ఈ అంశం మరింత ఆసక్తిగా మారింది.అయితే ఇప్పుడు నాగార్జునకు రూ.100 కోట్ల హిట్ రావాలంటే అనిల్ రావిపూడితో సినిమా చేయాలని అనేక మంది సినీ ప్రియులు, నెటిజన్లు, కొందరు అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచాయి. ముఖ్యంగా చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ లాంటి సీనియర్ హీరోలతో ఆయన చేసిన సినిమాలు పండగల సీజన్ లో భారీ వసూళ్లను సాధించాయి.ఇప్పటివరకు అనిల్ రావిపూడితో పని చేయని సీనియర్ హీరోల్లో నాగార్జున ఒకరే మిగిలారు. అందుకే ఆ కాంబినేషన్ వస్తే నాగ్ కెరీర్ కు ఇది సరైన టర్నింగ్ పాయింట్ అవుతుందని సినీ వర్గాలు అంటున్నాయి. ఫుల్ ఎంటర్టైనర్ అయినా, కొత్తదనం ఉన్న కథ అయినా అనిల్ రావిపూడి హ్యాండిల్ చేయగలరనే నమ్మకం ఇండస్ట్రీలో ఉంది. అంతేకాదు సీరియస్ టోన్ ను కూడా సక్సెస్ ఫుల్ గా చూపించగలరు. ఇప్పటికే భగవంత్ కేసరి మూవీతో అది నిరూపించారు.అదే సమయంలో అనిల్ సినిమాలు తక్కువ బడ్జెట్ లో వేగంగా పూర్తవుతాయి. దీంతో నాగార్జున నటుడిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా వ్యవహరించే అవకాశం ఉంటుంది. ఏదేమైనా.. నాగార్జున, అనిల్ కాంబినేషన్ లో సినిమా వస్తే, అది నాగ్ కు ఫస్ట్ రూ.100 కోట్ల హిట్ గా నిలిచే అవకాశం ఉందని ఆయన అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మరేం జరుగుతుందో.. ఆ కాంబోలో ఎప్పుడు మూవీ వస్తుందో వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com